ప్రజాశక్తి
బుధవారం 08 మార్చి 2023
5
కర్నూలు





ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు విజయ్

తొలగించిన కార్మికులను
విధుల్లోకి తీసుకోవాలి

- సిఐటియు నగర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

విధుల నుండి అక్రమంగా తొలగించిన జిజిహెచ్ పారిశుధ్య కార్మికులను విధులలోనికి తీసుకోవాలనీ సిఐటియు నగర కమిటీ డిమాండ్ చేసింది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న కె.లక్ష్మి, జి.కళ్యాణ్ కుమార్‌లను విధుల్లోనికి తీసుకోవాలని కోరుతూ సూపరింటెండెంట్ ఆఫీస్ గాంధీ విగ్రహం ముందు నిరసన కార్యక్రమం సిఐటియు నగర నాయకులు రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅదితులుగా సిఐటియు నగర ప్రధాన అధ్యక్ష కార్యదర్సులు అబ్దుల్ దేశాయ్, విజయ్, నగర ఉపాధ్యక్షులు రాజశేఖర్, రాజగోపాల్, ఆర్. కృష్ణ, మహమూద్, సోలమన్‌రాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్ దేశాయ్, విజయ్, రాజగోపాల్, కృష్ణ మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో హాస్పిటల్లో పరిశుభ్రంగా ఉంచడానికి ఎ1 ఏజెన్సీ కాంట్రాక్టు దక్కించుకుని విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు అగ్రిమెంట్ ప్రకారం రూ.16 వేల జీతం, ఇఎస్ఐ, పిఎఫ్, జీతంతో కూడిన వారాంతపు సెలవులు, వర్క్ మెటీరియల్, సేఫ్టీ మెటీరియల్ ఇవ్వాల్సి ఉండగా తక్కువ జీతాలు ఇస్తూ, ఇఎస్ఐ, పిఫ్ సక్రమంగా చెల్లించాలని కార్మికులు చైతన్యంతో సంఘాన్ని ఏర్పాటు చేసుకొని హక్కుల కోసం, జీతాల కోసం పోరాడుతున్నందున ఓర్వలేని యాజమాన్యం టార్గెట్ చేస్తూ అకారణంగా విధుల నుండి తొలగించడానికి లేని సమస్యలను సృష్టించి విధులు నుండి తొలగిస్తున్నారని వారు తెలిపారు. పారిశుధ్య కార్మికులు లక్ష్మీ ఉద్దేశపూర్వకంగా వేరే వారితో గొడవ చేయించి, డ్యూటీ పాయింట్‌లో లేవని, గొడవ చేసావని అధికారులతో మాట్లాడుకోని రమ్మని చెప్పి డ్యూటీ ఆపేశారన్నారు. కళ్యాణ్ కుమార్ సూపర్వైజర్లను తిట్టాడనే నెపంతో డ్యూటీని నిలబెట్టి వేధిస్తున్నారని తెలిపారు. వారిని సరైన కారణాలు చూపకుండా డ్యూటీ నుండి తొలగించామని వేధిస్తూ భయపెడుతూ వారిని మానసికంగా వేధిస్తున్నారని తెలిపారు. హాస్పిటల్ సుపరింటెండెంట్, డాక్టర్లు, అధికారులు ఒకటికి రెండుసార్లు చెప్పినా, ఎ1 ఏజెన్సీ సబ్ కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మిమ్మలను డ్యూటీలో తీసుకునే ప్రసక్తే లేదని, నన్ను జీతాల కోసం అడిగే ధైర్యం ఎక్కడి నుంచి వచ్చిందని మీ అంతు చూస్తానని, హాస్పటల్లో నేనేమనుకుంటే అదే జరుగుతుంది, ఏ అధికారి కూడా నన్ను ఎవడు ఏం చేసుకోలేదని, మీ కుటుంబాలను రోడ్డున పడేంత వరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదని కార్మికులను భయపడిస్తున్నాడని వారు తెలిపారు. హాస్పటల్ సూపర్డెంట్ మిగిలిన అధికారులు జోక్యం చేసుకొని తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోనికి తీసుకొని వారి సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే కాలంలో ఉద్యమాన్ని ఉధతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డి. కుమార్, చంద్ర, భాష, కుమార్, లక్ష్మీ, విశ్వనాథం, అయ్యన్న, మద్దయ్య కార్మికులు పాల్గొన్నారు.

సమాజ ప్రగతికి మహిళ పాత్ర అనంతం

- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ప్రజాశక్తి- విలేకరులు

'ఎక్కడమ్మా నువ్వు లేనిది ఏమిటి నువ్వు చేయలేనిది' అని ఓ గేయ రచయిత చెప్పినట్లు సమాజ ప్రగతిలో మహిళ పాత్ర కీలకం.... ఈ అనంత విశ్వంలో స్త్రీ లేకపోతే జననం లేదు. గమనం లేదు. స్త్రీ లేకపోతే సష్టిలో జీవం లేదు. అసలు సష్టే లేదు. మరి.. మనల్ని కంటిపాపలా కాపాడే 'స్త్రీ మూర్తి' ని స్మరించుకోవడం మనందరి బాధ్యత.. తల్లిగా లాలిస్తూ.. తోబుట్టువుగా.. భార్యగా బాగోగులు చూస్తూ.. సేవకురాలిలా కుటుంబ భారాన్ని మోస్తుంది.. విద్య, వైద్యం, వ్యాపారాలు, రాజకీయాలు, క్రీడలు, బ్యాంకింగ్, అంతరిక్షం, టెక్నాలజీ వంటి పలు రంగాల్లో రాణిస్తూ మహిళా సాధికారత సాధన దిశగా అడుగులు వేస్తోంది నేటి మహిళ.. మానవ వనరుల వినియోగంలో కీలక పాత్ర వహిస్తోంది. స్వశక్తితో తమ ఆర్థిక అవసరాలను తీర్చుకుంటూనే అన్ని రంగాల్లోనూ తానై నిరంతర జీవనయానం సాగిస్తోంది.. స్త్రీ శక్తి అంటే ఏంటో ప్రపంచానికి తెలియచెబుతోంది.. అలాంటి శ్రమజీవికి మనసారా.. ధన్యవాదాలు చెప్పుకునే సమయం ఇదే... మార్చి 8 న అంతర్జాతీయ మహిళా దినోత్సవం. ఈ సందర్భంగా వివిధ రంగాల మహిళా మణులను ప్రజాశక్తి పలుకరించింది. వారి అభిప్రాయాలతో ప్రత్యేక కథనం.....

సృష్టికి ప్రతిరూపం స్త్రీ...

- మెప్మా పిడి ఎం.నాగ శివలీల

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



సృష్టిలో మహిళకు ప్రత్యేక స్థానం ఉంది. సృష్టికి ప్రతిరూపం స్త్రీ, ఇంట్లో ఆడ మగ తేడా లేకుండా తల్లిదండ్రులు సమానంగా పిల్లలను పెంచాలి. సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనే విధంగా పాఠశాల స్థాయి నుండి వారికి ధైర్యాన్ని నింపాలి. ఆత్మ రక్షణ కోసం కరాటే లాంటివి నేర్పించి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపాలి. మహిళపై దాడులు జరుగుతున్నాయి అంటే అందుకు ప్రధాన కారణం పాఠశాల దశ నుండే వారికి ఎక్కువ స్వాతంత్రం కల్పించడం తోపాటు, వారికి సెల్ లు ఇవ్వడం కూడా ఒక కారణం. వారి సెల్‌ఫోన్లను తరచూ పరిశీలిస్తూ ఉండాలి. వారు సెల్ ఫోన్లు వాడకుండా చూడాలి. మంచి కోసమే ఉపయోగించాలని తెలియజేయాలి. ఝాన్సీ లక్ష్మీబాయి లాంటి వీర వనితల గాథలను వారికి తెలియజేయాలి. బాలికలకు ధైర్యాన్ని నింపాలి. మహిళలకు ఉండే చట్టాలను గురించి వివరించాలి. పాలకులు చట్టాలు కఠినంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

స్త్రీ అభివృద్ధితోనే సమాజాభివృద్ధి

- టిపిఒ వెంకటలక్ష్మీ



స్త్రీ అభివృద్ధి చెందినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని టిపిఒ ఆర్ వెంకటలక్ష్మి అన్నారు. పక్షి ఒక రెక్కతో ఎగరలేదు. స్త్రీ పురుషులు ఇద్దరూ సమానంగా ఉండాలి. ఆకాశంలో సగం, అవకాశాల్లో సగం అంటున్నారు. స్త్రీ అభివృద్ధి చెందుతున్నప్పటికీ, అన్ని రంగాలను అందిపుచ్చుకొని అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. స్త్రీలపై అత్యాచారాలు జరగకుండా ఉండాలంటే ఆడపిల్లల పై తల్లిదండ్రులు ప్రత్యేక నిఘా ఉంచి, మంచి మార్గంలో నడిపిస్తూ అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వం ద్వారా రక్షణ కల్పించే యాప్‌లను, రక్షణ కవచాల్లా ఉండే ఫోన్ నంబర్లను వారికి అందుబాటులో ఉంచి, అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆడపిల్లలకు ఎక్కువ స్వాతంత్ర్యం ఇవ్వరాదు

- స్వేచ్ఛను మహిళా ఉన్నతకి ఉపయోగించు కోవాలి

- డిప్యూటీ కమిషనర్ ఎస్‌వి.రమాదేవి



మహిళలకు ఇచ్చిన స్వేచ్ఛను వారి ఉన్నతికి ఉపయోగించుకోవాలి. మన పూర్వపు మహిళలు సాధించిన స్వేక్షను మనం ఇప్పుడు అనుభవిస్తున్నాం. స్వేచ్ఛను సరైన పద్ధతిలో వినియోగిస్తున్నామా లేదా అని ఆలోచించాలి. స్వేచ్ఛ అంటే పురుషులతో సమానంగా కలిసి తిరగడం, వేషధారణ కాదు. స్వేచ్ఛను సామాజిక బాధ్యతగా తీసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లోని తల్లిదండ్రులు ఇప్పటికీ ఆడపిల్లలకు చదువు ఎందుకు అనే భావన కలిగి ఉన్నారు. స్త్రీ నేడు అన్ని రంగాల్లో పురుషుల కన్నా మిన్నగా ముందుకు పోతుంది. మహిళలు మానసికంగా పురుషులకన్నా చాలా దఢంగా ఉంటారు. సమాజ హితం కోసం మహిళలు మంచిని స్వీకరించి ఆచరించాలి. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళలందరికీ శుభాకాంక్షలు.

ఇంటి నుంచే ఆడపిల్లలకు మనోధైర్యం నింపాలి

- సిద్ధారెడ్డి రేణుక, డిప్యూటీ మేయర్ , కర్నూలు



ఇంటి నుండి ఆడపిల్లలకు మనోధైర్యాన్ని నింపే విధంగా తల్లిదండ్రులు శిక్షణ ఇవ్వాలని కర్నూలు నగర డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక అన్నారు. ఆడపిల్ల పుట్టగానే అమ్మా ఆడపిల్లనా? అనే స్థాయి నుండి లక్ష్మీదేవి పుట్టింది అనే స్థాయికి వచ్చాం. భారతదేశంలో మహిళలకు ప్రాధాన్యత పెరిగింది. మహిళలు విద్యా, ఉద్యోగపరంగా ఎంత దూరమైనా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారు. ఇటీవల మెడికో స్టూడెంట్ ప్రీతి హత్య విచారకరం. ఆడపిల్లలకు చిన్న వయసు నుండి చదువుకునేందుకు జగన్ ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. విదేశీ విద్య కూడా అందించేందుకు సహకరిస్తుంది. రాజకీయ రంగాల్లో కూడా మహిళలకు ప్రాధాన్యత పెరిగింది. మహిళలకు రాజకీయాల్లో 50శాతం రిజర్వేషన్ కల్పించినందువల్లే తాను ఈ స్థాయిలో ఉండి ప్రజలకు సేవలు అందిస్తున్నాను. ఈ విషయంలో జగన్ ను ప్రత్యేకంగా అభినందిస్తున్న. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలు.

మహిళలు మనోధైర్యంతో ఉండాలి

- డాక్టర్ శంకర్‌బాయి, ఇఎస్ఐ, కర్నూలు



స్త్రీ నేడు అన్ని రంగాల్లో పురుషులతో పాటు సమానంగా ముందుకు పోతుంది. సమాజంలో మార్పు తీసుకురావాలంటే మహిళ ముందడుగు వేయాలి. మహిళలు మానసికంగా పురుషులకన్నా చాలా ధృఢంగా ఉంటారు. చిన్నపాటి సమస్యలకు క్షణికావేశానికి లోను కాకూడదు. అన్నింటికీ ఆత్మహత్య పరిష్కారం కాదు.బతికి సాధించాలి. సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి. సమాజ హితం కోసం మహిళలు మంచిని స్వీకరించి ఆచరించాలి. మెడిసిన్ చదవడానికి నాకు మా అన్నలు ప్రోత్సహించారు. మా అమ్మ మనోధైర్యాన్ని నింపింది. మా అమ్మ ఇందిరాగాంధీ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు ఆమెను చూశారు. ఆడపిల్లలంటే అలా ఎదగాలి. ప్రతి సమస్యను ధైర్యంగా ఎదుర్కోవాలని చెప్పారు. మహిళ ప్రతిభావంతురాలైతే అందరూ సమకరిస్తారు. మహిళల కోసం డాక్టర్ బిఆర్ అంబేద్కర రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులను పాలకులు అమలు చేయాలి. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు.

చట్టాలు ఉన్నవారికి చుట్టాలుగా మారాయి

- ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.అలివేలు.



చట్టాలు ఉన్నవారికి చుట్టాలుగా మారాయని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.అలివేలు అన్నారు. అమ్మాయిలపై దాడులు ఎక్కువయి హత మారుస్తున్నారని చెప్పారు. పరువు హత్యలు కూడా ఎక్కువయ్యాయని అన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లలకు పదవ తరగతి వరకు అన్ని వసతులు కల్పిస్తూ, యుక్త వయసు వచ్చిన తర్వాత ఎలాంటి వసతులు కల్పించడం లేదు. కులాంతర వివాహాలు చేసుకుంటే హతమారుస్తున్నారు. మహిళల పై జరిగే అఘాయిత్యాలు, హత్యల కు సంబంధించిన చట్టాలు కఠినంగా అమలు చేసి శిక్షలు పడేలా చేయాలి.

జిడిపిలో మహిళలదే అగ్ర భాగం

- అధ్యాపకురాలు డాక్టర్ అక్తర్ బాను



ప్రస్తుత దేశ జిడిపిలో మహిళలే అగ్రభాగంలో ఉన్నారు. సర్వీసు రంగంలో జిడిపిలో మహిళల నుండే అత్యధికంగా దేశ ఆర్థిక పురభివద్ధిలో భాగస్వామ్యం అయ్యారు. మహిళలు ఒకవైపు కుటుంబ బాధ్యతలను మరోవైపున ఉద్యోగ బాధ్యతలను సమానంగా చూసుకుంటున్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించడం అభినందనీయం. మహిళా సాధికారత దిశగా ఇటీవల కాలంలో ముందుకు సాగుతున్నారు.

స్త్రీలకు సమాన హక్కులు లభించాలి

- కెవిఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఇందిరా శాంతి



స్త్రీలకు సమాన హక్కులు లభించినప్పుడే ఆ సమాజం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేర్కొన్నారు. సమాజంలో దళితులు ఏ విధంగా అణగారి ఉన్నారు. అదేవిధంగా స్త్రీలు కూడా ఉన్నారన్నారు. మహిళలు ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా అభివృద్ధి చెందినప్పుడే దేశం కూడా అభివద్ధి చెందుతుంది.

మిగతా 6వ పేజీలో...



ఆందోళనకు దిగిన రైతులు

కన్నెర్రచేసిన మైనింగ్ రైతులు..

సమస్యలను పరిష్కరించే వరకుఅపాలి

మైనింగ్ పనులు దగ్గర రైతుల ఆందోళన..

ప్రజాశక్తి-తుగ్గలి

తమ సమస్యలను పరిష్కరించేంతవరకు మైనింగ్ పనులను ఆపాల్సిందేనని తుగ్గలి మండలం పగిడిరాయి, బొల్లవానపల్లి, పగిడి రాయి కొత్తూరు, జొన్నగిరి తదితర మైనింగ్ కోసం భూములు పోయిన రైతులు మంగళవారం మైనింగ్ పనులు దగ్గర ఆందోళన దిగారు. ఈ సందర్భంగా రైతుల మాట్లాడుతూ తమ భూములకు లీజులు ఇస్తామన్నందుకే రైతులు అంత కలసి జియో మైసూర్ సర్వీసెస్ కంపెనికి భూములు ఇచ్చామన్నారు. అటు లీజు ఇవ్వక ఇటు భూములు కొనక రైతులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. అదేవిదంగా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని చెప్పి ఇంతవరకు పట్టించు కోలేదన్నారు. అదేవిదంగా భూములు అన్ని కొంటామని ఇంతవరకు వాటిని కూడా కొనలేదన్నారు. పై సమస్యపై గ్రామ సభ నిర్వహించి తమ డిమాండ్లు పరిష్కరించె వరకు ఆందోళన చేస్తామని రైతులు తెలిపారు.



పనులను నిలిపివేసిన రైతులు



రోడ్లు ఊడుస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బివై.రామయ్య

మహిళా కార్మికులతో

-రోడ్లు, కాలువలు శుభ్రం చేసి-వారితోనే టిఫిన్ చేసి

-మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మేయర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సమాజాభివృద్ధిలో మహిళలదే కీలక పాత్ర అని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, నగర మేయర్ బివై. రామయ్య అన్నారు. మంగళవారం 19వ వార్డులో జోహరపురం రోడ్డున మేయర్, ఎమ్మెల్యే పారిశుధ్య కార్మికులతో కాసేపు గడిపారు. ముందుగా అక్కడున్న కాలువ, రోడ్లను శుభ్రం చేశారు. తర్వాత అల్పాహారం తెప్పించి కార్మికులతో కలిసి తిన్నారు. బుధవారం మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. మేయర్ మాట్లాడుతూ నగర పరిశుభ్రత ప్రజలందరి బాధ్యతఅని, కర్నూలు పరిశుభ్రతలో పారిశుధ్య మహిళ కార్మికుల పాత్ర భేష్ అన్నారు. సమాజంలో ప్రతి రంగంలో మహిళలు తమ సత్తా చాటుతున్నారంటూ వారి ప్రతిభను కొనియాడారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నామమాత్రంగా మహిళలను ప్రోత్సాహించేవారేనని, ప్రస్తుత ప్రభుత్వం నామినేట్ పదవుల్లో, కాంట్రాక్టుల్లో, నామినేట్ పనుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. నగరంలోని పారిశుధ్య కార్మికులకు ఎప్పుడూ ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామన్నారు. రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్.గోపాల్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర్ రెడ్డి, 20వ వార్డు కార్పొరేటర్ లక్ష్మిరెడ్డి, శానిటేషన్ ఇన్స్పెక్టర్ ఆర్.రాజు, మేస్త్రీలు నర్సింహులు, సుంకన్న నాయకులు బాబన్న పాల్గొన్నారు.

పోతుల నాగరాజు గెలుపుకోసం ప్రచారం

ప్రజాశక్తి- సి బెళగల్



ప్రచారం చేస్తున్న నారాయణ, వెంకట్

మండలంలోని అన్ని గ్రామాల్లో పిడిఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు గెలుపుకోసం ఆయా ప్రజా సంఘాలు మంగళవారం ప్రచారం జోరుగా సాగించారు. ఇక్కడే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నారాయణ, సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యులు మోహన్ లు ప్రచారానికి మద్దతుగా నిలిచి పోరాడే నాయకులను ఎన్నుకోవాలని ఓటర్లను కోరారు. పోతుల నాగరాజు సమాజ అభివృద్ధికే నిరంతరం పాటు పడే వ్యక్తి అని నిరుద్యోగుల సమస్యలపై ఉద్యోగాల భర్తీ కోసం కృషి చేస్తారన్నారు.

మహిళా సాధికారత కు కృషి చేయాలి

ఐద్వా రాష్ట్ర నాయకులు పినిర్మల

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : మహిళా సాధికారతకు పాలక ప్రభుత్వాలు కఅషి చేయాలని ఐద్వా రాష్ట్ర నాయకులు పి నిర్మల పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని కెవిఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవ పురస్కరించుకొని సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరాశాంతి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో పి నిర్మల, కర్నూల్ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ తల్లి మునవర్ సుల్తానాలు ముఖ్యోపన్యాసం చేశారు. మహిళలు అన్ని రంగాల్లో ఇటీవల కాలంలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రుల పెట్టు కొన్న ఆశలను, ఆశయాలను, బిడ్డలు నెర వేర్చాలన్నారు. మంచి స్థాయిని సంపాదించుకోవాలచ్చారు. సదస్సులో కొండా సుజాత, సౌమ్య, ప్రీతి, దూరదర్శన్ రిపోర్టర్ రమణయ్య , వేదవతి, తెలుగుశాఖ అధ్యక్షులు డాక్టర్ బా శెట్టి లత, డాక్టర్ పార్వతి, బయసుశీల, జయలక్ష్మి అధ్యాపక,ఆద్యాకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉస్మానియా కళాశాల లో

నగరంలోని ఉస్మానియా డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవం వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల కరస్పాండెంట్అజ్రాజావేద్ పాల్గన్నారు. ఉస్మానియా కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ ,కళాశాల ప్రిన్సిపల్ సమీవుద్దీన్ ముజమ్మిల్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ మండి అన్వర్ హుస్సేన్ ఐసిఐసిఐ బ్యాంక్ రీజనల్ మేనేజర్ సయ్యద్ హనీఫ్ అహ్మద్, ఐసిఐసిఐ హెచ్‌ఆర్ మేనేజర్ హుస్సేన్ బాష, మహిళా విభాగం ప్లేస్మెంట్ ఇన్‌ఛార్జులు బీబీ నవాజ్ కుమారి, ఎంఎస్.తయ్యిబా బీబీ, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

సిల్వర్ జూబ్లీ కళాశాలలో


నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో మహిళా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివి సుబ్రహ్మణ్య కుమార్ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు విద్యార్థినీలకు పలు రకాల పోటీలను నిర్వహించారు. మహిళా విభాగం సాధికారత కార్యదర్శి డాక్టర్ అక్తర్ భాను అధ్యక్షతన నిర్వహించారు. అధ్యాపకులు అనుషా, పార్వతి, ముంతాజ్ నాగమణి సరోజమ్మ విద్యార్థినిలు పాల్గొన్నారు.



కెవిఆర్ కళాశాల సదస్సులో మాట్లాడుతున్న పి.నిర్మల

మానవ మనుగడకు ప్రాణం పోసింది మగువ

డాక్టర్ బివి. ప్రార్థనా సిన్హా, నేత్ర వైద్య నిపుణులు, కర్నూలు



'మానవ జాతి మనుగడకే ప్రాణం పోసింది. మగువ' అన్నారు సినారె. అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2023 యొక్క ముఖ్య అంశం – లింగ సమానత్వం. ప్రపం చంలో ఎంతో మంది మహిళలు నేటికి కూడా డిజిటలైజేషన్ యుగంలో కూడా వారి ప్రాథమిక హక్కుల కోసం పోరాడవలసి వస్తోంది. ఈ నేపథ్యంలో మహిళలకోసం అవకాశాలతో కోసం చట్టపరమైన విధానాలను పటిష్ఠం చేయాలి. అంతేకాకుండా తల్లిగా, సోదరిగా, అర్థాంగిగా బహువు రూపాలలో మనిషి మనుగడను సన్నం చేస్తున్న మహిళలను కుటుంబమే వెన్నెముకలా ప్రోత్సహించాలి. ప్రతి మనిషి మాననిక వైఖరిలో, నైతిక వర్తనలో విలువలు పెరిగినప్పుడే మహిళకు తగిన గౌరవం దక్కుతుంది. "యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః" ఎప్పుడైతే ప్రతి తల్లి, తండ్రి, ఉపాధ్యాయుడు వారి పిల్లలకు మహిళల పట్ల గౌరవాదరణలను నేర్పిస్తారో ఈ అప్పుడే ఈ రోజుకి సార్థకత కలుగుతుంది.

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికలు

ఎన్నికల పరిశీలకులు పోలా భాస్కర్, హరి జవహర్ లాల్

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

శాసనమండలి ఎన్నికలను ప్రశాంతంగా, పకడ్బందీగా, ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని.. ఎన్నికల పరిశీలకులు డాక్టర్ పోలాభాస్కర్, ఎం.హరి జవహర్ లాల్ నోడల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సంసిద్ధత పై ఎన్నికల పరిశీలకులు పోలా భాస్కర్ డాక్టర్ ఎం..హరి జవహర్ లాల్, ఉమ్మడి జిల్లా నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు పి కోటేశ్వరరావు, మనజీర్ జిలాని సామూన్ లతో పాటు ఎస్పీలు సిద్ధార్థ్ కౌశల్, రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ రామ సుందర్ రెడ్డి, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్ తేజ, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, రెండు జిల్లాల డిఆర్‌ఒలు హాజరయ్యారు. ఓటర్ స్లిప్‌ల పంపిణీ, మ్యాన్ పవర్ మేనేజ్మెంట్, మెటీరియల్ మేనేజ్మెంట్, బ్యాలెట్ బాక్సులు, వెబ్ కాస్టింగ్ తదితర అంశాలపై రెండు జిల్లాల నోడల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల పరిశీలకులు పోలా భాస్కర్ మాట్లాడుతూ ఎన్నికల విధులకు సంబంధించి ప్రతి ఒక్కరూ చాలా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. మొదటిసారి ఎన్నికలను నిర్వహిస్తున్నామనే భావనతోనే అధికారులు పనిచేయాలని సూచించారు. ఎన్నికల విధులకు సంబంధించి ఖచ్చితంగా టైమ్ లైన్ పాటిస్తూ, ఆ లోపు పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకోసం అడ్వాన్స్‌గా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఓటర్ స్లిప్ ల పంపిణీ పై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఈ నెల 8 వ తేదీ లోపు ఓటర్ స్లిప్ ల పంపిణీని పూర్తి చేయాలని ఆదేశించారు. 49 మంది అభ్యర్థులతో ఎక్కడా లేనంతగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక సంబంధించిన బ్యాలెట్ పేపర్ సైజ్‌లో చాలా పెద్దగా ఉంటుందని, వీటిని సూక్ష్మ స్థాయిలో పరిశీలన చేయాలని సూచించారు. బ్యాలెట్ పేపర్ ను ఎలా మడవాలి తదితర అంశాలపై కూడా ఎన్నికల సిబ్బందికి క్షుణ్ణంగా శిక్షణ ఇవ్వాలని సూచించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్‌కు సూచించారు. వెహికల్స్ తనిఖీ పై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో అధికారులు వారు నిర్వహించాల్సిన పాత్రను సరిగా అర్థం చేసుకోవాలన్నారు.ప్రిసైడింగ్ అధికారి ప్రశాంతంగా విధులు నిర్వహించేలా నోడల్ అధికారులు చర్యలుతీసుకోవాలన్నారు..సమిష్టిగా విధులు నిర్వహిస్తేనే విజయం సాధిస్తామన్నారు..ప్రతి ఒక్క అంశంలో స్పష్టత ఉండాలన్నారు. అంతకుమునుపు కర్నూలు,నంద్యాల జిల్లా కలెక్టర్లు, ఎస్పీ లు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను గురించి వివరించారు.ఎన్నికల కమిషన్ నిబంధన ప్రకారం తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో రెండు జిల్లాల డిఆర్‌ఒలు నాగేశ్వర రావు, పుల్లయ్య, ఆర్‌డిఒలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



ముంతాజ్ కు యోగాచార్య అవార్డ్ ప్రదానం

ప్రజాశక్తి-కర్నూల్ స్పోర్ట్స్



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగ రంగంలో విశేష సేవలను అందించిన కర్నూలు నగరానికి చెందిన యోగ శిక్షకులు, జిల్లా యోగ సంఘం వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ముంతాజ్ బేగంకు యోగాచార్య అవార్డును మంగళవారం కర్ణాటక రాష్ట్రయోగాసన అసోసియేషన్ ప్రకటించింది. ముంతాజ్ బేగం ఎంఎస్‌సిలో యోగా చేశారు. యోగ , మెడిటేషన్ చేసి 2019లో న్యూఢిల్లీ హెచ్‌బియు యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. యోగ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన జాతీయ న్యాయ నిర్ణేతల పరీక్షలో 85 మార్కులు దేశంలోనే మొదటి ర్యాంక్ ను సాధించారు. డాక్టర్ ముంతాజ్ బేగంకు అవార్డు రావడం పట్ల రాష్ట్ర యోగ సంఘం చైర్మన్ లక్ష్మీకాంతరెడ్డి, రాష్ట్ర యోగ సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి, జిల్లా యోగ అసోసియేషన్ సభ్యులు,తదితరులు హర్షం వ్యక్తం చేశారు.


సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ గోపీనాథ్

కౌమార దశపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - ఆదోని

కౌమార దశలో ఎదుర్కొనే సమస్యలపై బాలబాలికలకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఆదోని లయన్స్ క్లబ్ సంయుక్తంగా మంగళవారం పట్టణంలోని నోబుల్ ఒకేషనల్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ గోపీనాథ్ మాట్లాడారు. ఈ వయస్సులో మానసికంగా, శారీరకంగా ఎదుర్కొనే సమస్యలు, వారు ఎలా ప్రమాదాలకు గురవుతారు, ఒత్తిడితో ఆత్మహత్యలు ఎందుకు చేసుకుంటారన్న దానిపై పలు సూచనలు చేశారు. మద్యం, మాదకద్రవ్యాలు తదితర వాటికి ఎలా బానిసలవుతారనే అంశాలపై, నివారణ చర్యలపై వైద్యులు నిపుణులు అవగాహన కల్పించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు ఉషా రావు, సెక్రటరీ కిరణ్ కుమార్, స్టేట్ వర్కింగ్ మెంబర్ కృష్ణమూర్తి, హరీష్, వైద్యులు అనూష, రమామని, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ధర్మారెడ్డి, జోన్ చైర్మన్ ప్రసాదరావు, ఈసీ మెంబర్ ఓం ప్రకాష్ పాల్గొన్నారు.

మహిళలు వాణిజ్య రంగంలో రాణించాలి

- మహిళా స్వయం సహాయక బృందానికి సర్టిఫికెట్ల పంపిణీలో వక్తలు


సర్టిఫికెట్లు పొందిన నారీమణులు

ప్రజాశక్తి - ఆదోని

మహిళలు వాణిజ్య రంగంలో రాణించి ఆర్థికంగా ఎదగాలని ఎఫ్ఎల్సి కౌన్సిలర్ శివుడు, మెప్మా ప్రాజెక్టు మేనేజర్ వీరా రెడ్డి, ఎపిఎం జనార్ధన్ రెడ్డి, కెడిసిసి బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ విజయ్ భాస్కర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని శ్రేయ బ్యూటీ పార్లర్ సెంటర్ వద్ద మహిళా స్వయం సహాయక బృందానికి 15 రోజుల అడ్వాన్స్ బ్యూటీషియన్ ట్రైనింగ్ ప్రోగ్రాం ముగింపు కార్యక్రమంలో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయం వారి ఆర్థిక సహకారంతో గ్లోబల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో సభాధ్యక్షులు దైవప్రసాద్ సమక్షంలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దైవప్రసాద్ మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, నైపుణ్యత పెంపొందించుకోవాలని, ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఆడవారికి కుటుంబం సహకారం అందించాలని కోరారు. గ్లోబల్ సర్వీస్ సొసైటీ వీరేషప్ప పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రలో ఆదోని నేతలు

ప్రజాశక్తి - ఆదోని


పాదయాత్రలో లోకేష్‌కు సమస్యలు విన్నవించిన నాయకులు

పీలేరు నియోజకవర్గంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేష్ చేపడుతున్న యువగళం పాదయాత్రలో మంగళవారం ఆదోని నేతలు పాల్గొన్నారు. కర్నూలు పార్లమెంట్ బీసీ (సగర) ఉప్పర సాధికార సమితి కన్వీనర్ గోనెబావి గోపాల్ మాట్లాడారు. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అన్ని రంగాల్లో వెనుబడిన సంచార జీవులుగా ఉన్న సగర కులాన్ని బీసీ-ఎ వర్గానికి మార్చాలని కోరారు. ఉప్పర కులస్తుల న్యాయమైన డిమాండ్లను యువగళం పాదయాత్రలో లోకేష్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. లోకన్న, మల్లికార్జున, ఆది పాల్గొన్నారు.

నత్తనడకన నిర్మాణాలు...

- ముందుకు సాగని ప్రభుత్వ భవన నిర్మాణాలు

ప్రజాశక్తి - దేవనకొండ

ప్రజల వద్దకే పాలన అనే ఉద్దేశంతో వైసిపి ప్రభుత్వం ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో రైతు భరోసా కేంద్రం, సచివాలయ భవనం, గ్రామ హెల్త్ క్లినిక్ నిర్మాణాలు చేపట్టింది. కాంట్రాక్టర్ల నిర్లక్ష్య ధోరణి, అధికారుల అలసత్వం, పర్యవేక్షణ లోపంతో ఆయా నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

దేవనకొండ మండలంలో 22 గ్రామ సచివాలయాలు, 22 రైతు భరోసా కేంద్రాలు, గ్రామ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు గతేడాది నుంచి నిర్మాణ పనులు చేపట్టారు. ఆయా గ్రామ సచివాలయాలు, గ్రామ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రతి గ్రామ సచివాలయ నిర్మాణ పనులకు రూ.40 లక్షలను ప్రభుత్వం కేటాయించింది. మండలంలో వెలమకూరు, పాలకుర్తి, తెర్నేకల్లు, కుంకనూరు, పి.కోటకొండ గ్రామాల్లో మాత్రమే గ్రామ సచివాలయ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మిగిలిన గ్రామాల్లో సచివాలయ భవన నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. రైతు భరోసా కేంద్రానికి రూ.22 లక్షలు ప్రతి భవనానికీ కేటాయించింది. రైతు భరోసా కేంద్రాల నిర్మాణ పనులు కేవలం గుండ్లకొండ, కుంకనూరు గ్రామాల్లో మాత్రమే ముందుకు సాగాయి. మిగిలిన చోట్ల మొండి గోడలకే పరిమితమయ్యాయి. ప్రతి గ్రామ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులకు రూ.18 లక్షల నిధులు కేటాయించారు. పనులు ప్రారంభానికి నోచుకోలేదు. నిర్మాణ పనులను పర్యవేక్షించాల్సిన పంచాయతీ రాజ్ మండల ఇంజినీర్ ఎప్పుడు వస్తాడో తెలియని పరిస్థితి నెలకొంది. దేవనకొండలో సైతం రెండు సచివాలయ నిర్మాణ పనులు, రైతు భరోసా కేంద్రం మధ్యలోనే నిలిచిపోయాయి. అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాలు రాత్రి సమయాల్లో మందుబాబులకు నిలయంగా మారాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తి భవన నిర్మాణ పనులు పూర్తి చేయించి, మొదలుకాని విలేజ్ హెల్త్ క్లినిక్ పనులు ప్రారంభించాల్సి అవసరం ఉందని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


మధ్యలోనే ఆగిన రైతు భరోసా కేంద్రం

ప్రశ్నించే వారిని ఎన్నుకుందాం

- సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ - ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రచారం

ప్రజాశక్తి - ఆదోని

ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ, ప్రజా సమస్యలను చట్టసభల్లో లేవనెత్తి పరిష్కార దిశగా ప్రశ్నించే వారిని ఎన్నుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, నాయకులు లక్ష్మన్న, తిప్పన్న కోరారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌టిసి కాలనీ, ఎల్ఐసి కాలనీ, అరుణ్‌జ్యోతి నగర్, హౌసింగ్ బోర్డు కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఏడాదికోసారి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేసి ఉద్యోగాలు కల్పిస్తామని గద్దెనెక్కిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాట మార్చారని విమర్శించారు. ప్రభుత్వ అసమర్థత కారణంగానే పరిశ్రమలు నెలకొల్పేందుకు పెట్టుబడిదారులు ముందుకు రావడం లేదన్నారు. ఉపాధి లేక నిరుద్యోగులు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలకు వలస వెళ్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో సాఫ్ట్‌వేర్ రంగాన్ని అభివృద్ధి చేయాల్సిన పాలకులు సమన్వయ లోపం, కక్ష సాధింపు ధోరణి అవలంబించడం వల్ల ఎవరూ సాహసించడం లేదన్నారు. రాయలసీమలో సిమెంట్, గ్రానైట్ పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా ఉన్నా ప్రభుత్వం ఆ దిశగా కృషి చేయడం లేదని తెలిపారు. ప్రశ్నించే వారు లేకపోవడం వల్ల ప్రభుత్వ ఆగడాలు రోజురోజుకూ మితిమీరుతున్నాయని మండిపడ్డారు. ఈ ప్రభుత్వానికి ఓటుతోనే తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈనెల 13న జరిగే పోలింగ్‌లో పట్టభద్రులు గమనించి ఓటు వేయాలని తెలిపారు. అలాగే పట్టణంలోని పలు ప్రాంతాల్లో డివైఎఫ్ఐ నాయకులు వీరేష్, మోహన్, జమీర్, నాగరాజు, శ్రీకాంత్ ప్రచారం నిర్వహించారు. **దేవనకొండ** మండలంలోని తెర్నేకల్ గ్రామంలో ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని గ్రామ సచివాలయం, బ్యాంకు, ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ప్రజాసంఘాల నాయకులు మహబూబ్ బాషా, బజారి, పరమేష్, కెపి.రాముడు పాల్గొన్నారు. **పెద్దకడబూరు** మండలంలోని చిన్నకడబూరు, రంగాపురం, తారాపురం, నౌలేకల్, గవిగట్టు, పీకలబెట్ట, బాపులదొడ్డి, పులికన్వి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు ఈ.తిక్కన్న, రైతుసంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.పరమేష్, డివైఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.నాగిరెడ్డి, బి.దాసు, సిఐటియు కార్యదర్శి ఈరన్న మాట్లాడారు. డివైఎఫ్ఐ నాయకులు రాజేంద్ర, రవి, నారాయణ, ఉరుకుందు, నరసింహా, పీరా పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** మండలంలోని కె.తిమ్మాపురం, కలగొట్ల, కె.నాగలాపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రజాసంఘాల నాయకులు హనుమంతు, బిటి.చిన్నన్న, ఎం.సత్తన్న, జనసేన పార్టీ తాలూకా నాయకులు బీసీ.నాగరాజు మాట్లాడారు. పిడిఎఫ్ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజును గెలిపించాలని కోరారు.


ఆదోనిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు


పెద్దకడబూరులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు


దేవనకొండలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు


ఎమ్మిగనూరులో ప్రచారం...

సమాజ ప్రగతికి మహిళ పాత్ర అనంతం

5వ పేజీ తరువాయి...

ఆకాశంలో సగం మాత్రమే కాదు

- డాక్టర్ వి.వింధ్యావాసినీ, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల



ఆకాశమే హద్దుగా ఎదిగే మహిళల జీవితప్రయాణం నిరంతర స్ఫూర్తిదాయకం. ఆమె సంకల్పశక్తికి అవకాశాలు తోడైతే అనేక విజయాలు ఆమె సొంతమవుతాయి. మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తున్నప్పటికీ ఇంకా ఎందరో స్త్రీలు అణచివేతకు, వివక్షకు, అభద్రతకు లోనవుతున్నారనేది చేదు నిజం. ఆమెకు అండగా నిలవాల్సిన కుటుంబం చేయూత, ఆదరించాల్సిన సమాజం చేత రెండువైపులా అణచివేతను ఎదుర్కోవడం బాధాకరం. మహిళల పట్ల వివక్ష చూపని సమాజాన్ని నిర్మించి, సామాజిక భద్రతను కల్పించాల్సిన అవసరం ఉంది. ఆర్థిక స్వేచ్ఛను పొందగలిగిన రోజున మాత్రమే నిజమైన మహిళా దినోత్సవం.

సమాజ నిర్మాణంలో మహిళలదే కీలకపాత్ర

- మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శమంతకమణి



సమాజ నిర్మాణంలో మహిళలపై కీలకం. ఇటీవల కాలంలో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారు అన్నారు. గతంలో కంటే ఎప్పటికీ భిన్నంగా పరిస్థితులు ఉన్నాయి. మహిళలు ఎంతో ధైర్యంగా ముందుకు వచ్చి కీర్తి ప్రతిష్టలు పొందడం అభినందనీయం. విద్యార్థులు వ్యక్తిగత రక్షణ కోసం నగరూరు సుబ్రహ్మణ్యం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా టైక్వాండో శిక్షణ కూడా ఇస్తున్నాం. ఈ అవకాశాన్ని ఎంతోమంది విద్యార్థినిలు వినియోగించుకుంటున్నారు. మహిళలు తమ హక్కుల సాధన కోసం ముందుకు సాగాలి.

మహిళలను సమానంగా గౌరవించాలి

- డాక్టర్ ధనశ్రీ అధ్యాపకురాలు కెవిఆర్ మహిళా కళాశాల



మహిళలు పురుషులతో సమానంగా అన్నిట్లో ముందుకు సాగుతున్నాం. అలాంటప్పుడు మహిళలను కూడా గౌరవించాలి. మహిళా సాధికారతకు అడుగులు వేయాలి.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలి

- సబ్ కలెక్టర్ కార్యాలయ ఎఓకు వినతి

ప్రజాశక్తి - ఆదోని


ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు ఎస్.సుదర్శన్, బసాపురం గోపాల్, లక్ష్మన్న, వీరేష్, సాబీర్ బాష, దస్తగిరి, రమేష్, పుష్పరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఎఐటియుసి, ఎఐఎస్ఎఫ్, సిఐటియు, ఎస్ఎఫ్ఐ, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న పట్టణంలోని 1వ వార్డు సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ వీరేష్‌పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సచివాలయ సిబ్బంది, వార్డు వాలంటీర్లు కూడా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంచాలని తెలిపారు.


కార్యాలయ ఎఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

- జిల్లా పంచాయతీరాజ్ విభాగం ఇన్‌ఛార్జీ, జడ్‌పిటిసి విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి


చిప్పగిరిలో పాలాభిషేకం చేస్తున్న జడ్‌పిటిసి విరుపాక్షి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయాలను, పార్టీ ఆదేశాలను అనుసరించి అభివృద్ధికి కష్టపడి పని చేసిన వారికి తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందని జడ్‌పిటిసి విరుపాక్షి తెలిపారు. జడ్‌పిటిసి విరుపాక్షిని ఉమ్మడి జిల్లాలకు పంచాయతీరాజ్ ఇన్‌ఛార్జీగా నియమించినందుకు మంగళవారం చిప్పగిరిలోని అంబేద్కర్ సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి మాట్లాడారు. పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేసే వారిని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గుర్తించి తప్పనిసరిగా న్యాయం చేస్తున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లాల పంచాయతీరాజ్ ఇన్‌ఛార్జీగా నియమించినందుకు మరింత బాధ్యతతో కార్యకర్తలను సైనికుల్లాగా తయారు చేస్తామన్నారు. ఏ ప్రభుత్వంలో కూడా వాల్మీకులకు గుర్తించలేదని, జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రతి పదవిలోనూ వాల్మీకులను గుర్తించి అగ్ర భాగంలో నిలబెడుతున్నారని తెలిపారు. మంచి భవిష్యత్తు కావాలంటే రాబోయే 2024 ఎన్నికల్లో వాల్మీకులందరూ వైసిపి విజయంలో కీలక పాత్ర పోషించేలా ఉండాలన్నారు. మాజీ కన్వీనర్ ఓబులేసు, వాల్మీకి మండల అధ్యక్షులు లోకనాథ్, నేమకల్లు సర్పంచి ప్రేమ్‌కుమార్, ఉప సర్పంచి పెద్ద పెద్దయ్య, విద్యా కమిటీ ఛైర్మన్ గంగాధర్, వైసిపి నాయకులు నాగప్ప, మహానంది, సేనాపతి, గురుదాసు, రామచంద్ర, శేషాద్రి, రాము, జ్ఞాన్, వెంకటేష్, శ్రీరాములు పాల్గొన్నారు. **ఆస్పరిలోని** అంబేద్కర్ సర్కిల్ దగ్గర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. చిప్పగిరి జడ్‌పిటిసి విరుపాక్షి కర్నూలు, నంద్యాల పంచాయతీరాజ్ వింగ్ జోనల్ ఇన్‌ఛార్జీగా నియమితులు కావడంతో బిణిగేరి సర్పంచి వెంకటేష్, యువ నాయకులు మసాలా ప్రకాష్ హర్షం వ్యక్తం చేశారు. అక్బర్, సందీప్, వీరేష్, మహేంద్ర, వెంకటేష్, మహేష్ పాల్గొన్నారు.


ఆస్పరిలో పాలాభిషేకం చేస్తున్న నాయకులు


గోడపత్రికలను విడుదల చేస్తున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

గద్దెరాళ్ల మారెమ్మ జాతర

గోడ పత్రికలు విడుదల

ప్రజాశక్తి - దేవనకొండ

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన దేవనకొండ మండలం పల్లెదొడ్డి గ్రామ పంచాయతీలోని గద్దెరాళ్ల గ్రామంలో వెలసిన శ్రీమారెమ్మ అవ్వ జాతర గోడపత్రికలను దేవదాయ శాఖ ఇఒ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, ఆయన సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు చేతుల మీదుగా మంగళవారం విడుదల చేశారు. జడ్‌పిటిసి కిట్టు, వైసిపి మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, వైసిపి నాయకులు నిజాల్ రెడ్డి, ప్రేమనాథ్ రెడ్డి, నారాయణ రెడ్డి, రాజారెడ్డి, చిట్టెం నాగేష్, మదన్ మోహన్ రెడ్డి, చంద్రన్న, దేవదాయ శాఖ సిబ్బంది శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రేమ, ఆప్యాయతలు మానవాళి గొప్పతనం

- శ్రీచైతన్య ప్రిన్సిపల్ గౌసియా ఖనమ్

ప్రజాశక్తి - ఆదోని

ప్రేమ, ఆప్యాయతలు మానవాళి గొప్పతనమని శ్రీచైతన్య-1 పాఠశాల ప్రిన్సిపల్ గౌసియా ఖనమ్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఫ్యామిలీ గ్లోరీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కుటుంబాల్లో ప్రేమ, ఆప్యాయతలు, ఉమ్మడి కుటుంబాల గురించి విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. ప్రేమ, ఆప్యాయతలు ఉన్నచోట మనస్సు నిర్మలంగా ఉంటూ, సంతోషంగా ఉండేందుకు అవకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. విద్యార్థులు ప్రేమను పంచుకొని తల్లిదండ్రులకు కానుకలుగా ఇవ్వాలని చెప్పారు. విద్యార్థులు ఆటలు, పాటలతో తల్లిదండ్రులను ఉత్సాహపరిచారు. ఎజిఎం సురేష్, ఆర్ఐ రంగారెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, ఎఒ అశోక్, అకాడమిక్ వీరారెడ్డి పాల్గొన్నారు.


విద్యార్థులను ఆశీర్వదిస్తున్న తల్లిదండ్రులు

మహిళలే మహారాణులు...

- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

- పోరాటం నుంచే మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

మహిళలు అన్నింటా పురుషులతో పాటు సమానంగా పోటీ పడుతున్నారు. అన్ని రంగాల్లో రాణిస్తూ మహారాణులుగా నిలుస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మార్చి 8న జరుపుకుంటారు. మహిళల విజయాలు సెలబ్రేట్ చేసుకోవడానికి ఈ రోజును ప్రత్యేకంగా జరుపుకుంటారు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

అమెరికాలోని న్యూయార్క్ నగరంలో 1909 ఫిబ్రవరి 28న అమెరికన్ సోషలిస్ట్ పార్టీ జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంది. కార్మిక కార్యకర్త థెరిసా మల్కెయిల్ ఈ రోజును ప్రతిపాదించారు. నగరంలోని రెడీమేడ్ గార్మెంట్స్ కార్మికులపై జరుగుతున్న అణచివేతను ఖండిస్తూ దినోత్సవాన్ని ప్రారంభించారు. దీని ప్రాముఖ్యతను చూసి ముగ్ధులయిన అమెరికన్ సోషలిస్ట్ నాయకులు మహిళా దినోత్సవాన్ని జరుపుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. అయితే, ఆ సమయంలో నిర్దిష్ట తేదీని నిర్వచించలేదు. ఈ నేపథ్యంలో 1975, 1977లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐరాస నిర్వహించింది. ఆ సంస్థ సంబరాలు ప్రారంభించింది. తదనంతరం, ఐక్యరాజ్యసమితి మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించింది. మహాసభ ప్రకటించింది. ఈ రోజున మహిళల హక్కులను కాపాడేందుకు , ప్రపంచవ్యాప్తంగా మహిళలు శాంతియుతంగా జీవించేందుకు చర్యలు తీసుకోవడానికి కట్టుబడి ఉంది. దీని తర్వాత ప్రతి సంవత్సరం మహిళా దినోత్సవం సందర్భంగా కొత్త థీమ్‌ను ప్రవేశపెడుతున్నారు. మహిళలు సాధించిన విజయాల గురించి మాట్లాడడమే కాకుండా, లింగ ఆధారిత భేదాలు, సమానత్వం లక్ష్యం, మహిళల హక్కులు మొదలైన వాటి గురించి కూడా ఈ రోజున అవగాహన కల్పిస్తారు. మహిళా సంక్షేమంపై దృష్టి సారించిన వివిధ మహిళా సంఘాలు ఈ రోజున నిధులు సమకూరుస్తున్నాయి.



ఆమెదే ఆధిక్యం

- 10 నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే ఎక్కువ

ఉమ్మడి జిల్లాలోని ఓటర్లలోనూ ఆమెదే ఆధిక్యం. జిల్లా వ్యాప్తంగా మొత్తం 33.44 లక్షల మంది ఓటర్లు ఉండగా 14 నియోజకవర్గాల్లో 10 నియోజకవర్గాల్లో మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది. ఆళ్లగడ్డ, నందికొట్కూరు, కర్నూలు, పాణ్యం, నంద్యాల, బనగానపల్లె, డోన్, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా కూడా మహిళా ఓటర్ల సంఖ్యనే ఎక్కువగా ఉంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 33,44,950 మంది ఓటర్లు ఉండగా అందులో 16,57,114 మంది పురుషులు, 16,87,244 మంది మహిళలు, 592 మంది స్త్రీలు ఉన్నారు. 49.54 శాతం మంది పురుష ఓటర్లు ఉండగా 50.44 శాతం మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఇతర ఓటర్లలో అత్యధికంగా నంద్యాలలో 104 మంది ఉన్నారు. అత్యధికంగా పాణ్యం నియోజకవర్గంలో 3,09,204 మంది ఓటర్లు ఉండగా శ్రీశైలం నియోజకవర్గంలో 1,92,380 మంది ఓటర్లు ఉన్నారు.

పట్టభద్రుల్లో 56.54 శాతం మహిళా ఓటర్లు

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ సాగుతోంది. ఇప్పటికే పోటీలో నిలిచే అభ్యర్థుల జాబితా ఖరారు కావడంతో అభ్యర్థులు ప్రచారం మునిగిపోయారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,178 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో మహిళలే అధికంగా ఉన్నారు. ఉమ్మడి జిల్లాలోని పట్టభద్ర ఓటర్లలో 512 మంది పురుషులు, 666 మంది మహిళలు ఉన్నారు. అన్ని రెవెన్యూ డివిజన్లలోనూ పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది. మొత్తం ఓటర్లలో అత్యధికంగా ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌లో 268 మంది ఓటర్లు ఉండగా అత్యల్పంగా పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లో 144 మంది ఓటర్లు ఉన్నారు.



కృష్ణజింకను స్టేషన్‌కు తీసుకువచ్చిన స్థానికులు

జనావాసంలోకి కృష్ణజింక

ప్రజాశక్తి- పిచ్చాటూరు (తిరుపతి జిల్లా)

తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండల కేంద్రంలో మంగళవారం ఉదయం కృష్ణ జింక ప్రత్యక్షమయ్యింది. తాగునీటి కోసం అడవి నుంచి దారితప్పి పిచ్చాటూరులోని బజారువీధికి వచ్చింది. కుక్కలు వెంటబడటంతో తోపువీధి వైపు పరుగులు తీస్తూ ఓ ఇంటి వద్ద అమర్చిన ఫెన్సింగ్ కమ్మీలకు జింక తల ఇరుక్కుపోయింది. అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి జింకను రక్షించారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. జింకకు స్థానిక పశు వైద్యాధికారులు వైద్యం చేసి అటవీ అధికారులకు అప్పగించారు.

కబడ్డీ ఆడుతూ కుప్పకూలిన విద్యార్థి

- చికిత్స పొందుతూ మృతి

ప్రజాశక్తి-మడకశిర రూరల్ (సత్యసాయి జిల్లా)



తనుజా నాయక్ (ఫైల్)

స్నేహితులతో సరదాగా కబడ్డీ ఆడుతూ ఓ విద్యార్థి ఆట స్థలంలోనే కుప్పకూలాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతను ఆరు రోజుల పాటు చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచారు. మృతుని కుటుంబ సభ్యుల కథనం ప్రకారం..శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండలం అచ్చంపల్లి తండాకు చెందిన తనుజా నాయక్ (19) అనంతపురం జిల్లా కేంద్రంలోని పివికెకె ఫార్మసీ కళాశాలలో బిఫార్మసీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. ఈ నెల ఒకటిన కళాశాల ప్రాంగణంలో మిత్రులతో కలిసి కబడ్డీ ఆడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతన్ని వెంటనే అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందారు. చదువుకునేందుకు వెళ్లిన కుమారుడు మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

విశాఖలో చకచకా ఏర్పాట్లు

- విశాఖ, భీమిలిని విఐపి జోన్‌గా గుర్తించిన ప్రభుత్వం
- నివాసాలు చూసుకుంటున్న సిఎంఒ సిబ్బంది

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



విశాఖలో సిఎం క్యాంపు కార్యాలయం ఏర్పాటుకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. విశాఖ నుంచి పాలన చేసే అంశంపై ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే సిఎం ప్రకటించనున్నారని సమాచారం. ఉగాది తర్వాత అక్కడ నుండే పరిపాలన జరగనుంది. దీనికోసం స్థానిక అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రిషికొండ, భీమిలికి ఆనుకుని ఉన్న ప్రాంతాలను ప్రభుత్వం విఐపి జోన్‌గా గుర్తించినట్లు తెలిసింది. రిషికొండపై ఏర్పాటు చేసే భవనాల్లోనే సిఎంఒ ఉండనుంది. దానికి ఆనుకుని ఉన్న నిర్మాణాల్లోనే సిఎంఒ అధికారులు, కొన్ని ప్రధాన విభాగాల హెచ్‌ఒడిలు ఏర్పడనున్నాయి. భీమిలి, విశాఖపట్నం మధ్యలో అన్ని ప్రాంతాలనూ కలిపే విధంగా రవాణా వ్యవస్థనూ ఏర్పాటు చేయనున్నారు. అత్యవసరం అయితే కొన్ని కార్యాలయాలను ఆంధ్రా యూనివర్సిటీకి సంబంధించిన భవనాల్లోనూ పెట్టే అవకాశం ఉందని తెలిసింది. సుప్రీం కోర్టు, హైకోర్టులో కేసులు ఉన్న నేపథ్యంలో పరిపాలనా రాజధానిపై పూర్తిస్థాయి ప్రకటన, స్పష్టత ఇవ్వకపోయినా సిఎంఒను మాత్రం విశాఖలో ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే విశాఖ బీచ్‌రోడ్డు, ఇతర రోడ్లనూ అభివృద్ధి చేస్తున్నారు. భీమిలి వరకూ ఎటువంటి అడ్డంకులూ లేకుండా రవాణా సదుపాయం ఏర్పాటు చేశారు. రిషికొండకు ఆనుకుని ఉన్న భవనాలను కార్యాలయాలుగా, అధికారుల నివాస ప్రాంతాలుగా ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగానే సిఎంఒలో పనిచేసే సిబ్బంది ఇప్పటికే విశాఖలో నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. పలువురు ఇప్పటికే అక్కడకు వెళ్లి వచ్చారు. ప్రస్తుతం రిషికొండపై జరుగుతున్న నిర్మాణాల్లోనే సిఎంఒ ఉండొచ్చని, దానికి ఆనుకుని ఉన్న నిర్మాణాల్లో పలువురు ఉన్నతాధికారుల కార్యాలయాలు ఉంటాయని తెలిసింది. పరిపాలనకు సంబంధించి పలు విభాగాల కార్యాలయాలు అమరావతిలోనే ఉంటాయని, కొన్నిటిని మాత్రమే విశాఖ తరలిస్తారనే ప్రచారం జరుగుతోంది. కార్యాలయాలు తరలిస్తే ఖర్చు హెచ్‌ఒడిల నుండి వసూలు చేస్తామని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో వారు కూడా ఆందోళనలో ఉన్నారు. దీన్నుండి బయటపడేందుకు అమరావతి కేసులను త్వరగా విచారించాలని ప్రభుత్వం సుప్రీం కోర్టును కోరింది. ఈ నెలలోనే దీనిపై స్పష్టత వస్తే వెంటనే కార్యాచరణను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేయనుంది.

కేంద్రం భద్రతాపర అభ్యంతరాలు

విశాఖలో రాజధాని ఏర్పాటు అంశంపై కేంద్రం కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈస్ట్రన్‌నేవల్ కమాండ్ ఇక్కడే ఉండటం, భద్రతాపరంగానూ కీలకమైన ప్రాంతం, పెట్రోలియం నిల్వలు, రక్షణ విభాగ నిల్వలకు విశాఖ తీరం కేంద్రం కావడంతో అక్కడ రాజధాని ఏర్పాటు చేస్తే వచ్చే సమస్యలపై కేంద్రం అభ్యంతరం పెట్టినట్లు తెలిసింది. దీనిపైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో చర్చలు జరుపుతోంది. త్వరలోనే ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

నిధులివ్వండి

- ఆర్థికశాఖకు పలు శాఖల డిమాండ్
- ఎస్‌ఎన్‌ఎ ఖాతాలకు మాత్రమే గ్రీన్‌సిగ్నల్!

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు ఇంకా కొద్ది రోజులు మాత్రమే గడువు ఉండడంతో పలు శాఖల నుంచి నిధుల కోసం డిమాండ్ పెరుగుతోంది. త్వరగా నిధులు విడుదల చేస్తే చేయాల్సిన కార్యక్రమాలు చాలా ఉన్నాయంటూ ఆర్థికశాఖకు విజ్ఞప్తులు వెల్లువలా వస్తున్నాయి. ఇందులో సాధారణ నిధులతోపాటు కేంద్ర పథకాలతో అనుసంధానంగా ఉన్న నిధులపైనా డిమాండ్లు కూడా ఎక్కువగానే కనిపిస్తున్నాయి. ఆర్థికశాఖ మాత్రం కేంద్ర పథకాలకు రాష్ట్రం తరపున వాటాగా ఇవ్వాల్సిన నిధులవైపే మొగ్గు చూపిస్తున్నట్లు సమాచారం. మరో 23 రోజుల్లో 2022-23 ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఇప్పటికీ పలు కీలక శాఖలకు నిధుల విడుదల కావడం లేదు. ప్రధానంగా పెట్టుబడి వ్యయానికి సంబంధించిన నిధులు కూడా రాకపోవడంతో ఆయా శాఖలు ఇబ్బందులు పడుతున్నాయి. 11 నెలలుగా నిధుల కోసం ప్రతిపాదనలు పెడుతున్నప్పటికీ నామమాత్రంగానే విడుదలవుతున్నట్లు అధికారులు అంటున్నారు. అందుకే చివరి రోజుల్లోనైనా ఈ నిధుల్లో ఎంతో కొంత సాధించుకునేందుకు ఆయా శాఖలు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం జరిగిన కార్యదర్శుల స్థాయి సమీక్షలోనూ అధికారులు ఈ నిధులపైనే నిశితంగా ప్రస్తావించినట్లు తెలిసింది. ప్రధానంగా విద్య, వైద్యం, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, మహిళాభివృద్ధి, గిరిజన సంక్షేమం, యువజన సంక్షేమం వంటి శాఖల అధికారులు ఆర్థికశాఖపై ఒత్తిడి పెంచుతున్నట్లు తెలిసింది.

కోవిడ్ నిధులూ పెండింగే..

వైద్యశాఖకు సంబంధించి కోవిడ్ కోసం ఖర్చు చేసిన నిధులూ ఇంకా విడుదల కాలేదని అధికారులు అంటున్నారు. 2020 నుంచి ఖర్చులో కొంతమొత్తం ఇంకా పెండింగ్‌లోనే ఉండడంతో అధికారులు పలు దఫాలుగా ఆర్థికశాఖకు లేఖలు రాశారు. ఇదే సమయంలో తమ శాఖలకు సంబంధించి కేంద్ర పథకాలతో అనుసంధానంగా ఉన్న నిధులను సింగిల్ నోడల్ ఏజెన్సీకి జమ చేయాల్సి ఉన్నప్పటికీ అవి విడుదల కాలేదని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ఆయుష్ నిధులు పెండింగ్‌లో ఉండడంతో వాటి కోసం ఆర్థికశాఖకు వైద్యాధికారులు లేఖలు రాస్తున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి సంబంధించి రూ.వెయ్యి కోట్లకుపైగా నిధులు ఆర్థికశాఖ వద్దనే పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. ఇందులో సింగిల్ నోడల్ ఏజెన్సీకి జమ చేయాల్సిన రూ.900 కోట్లు కూడా ఉన్నాయి. స్త్రీ శిశు సంక్షేమ శాఖకు సంబంధించి ఆర్టికల్ 271 నిధులు 2019 నుంచి పెండింగ్‌లోనే ఉన్నట్లు చెబుతున్నారు. క్రీడలు, యువజన సంక్షేమశాఖలో ప్రోత్సాహకాలు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయని, ఉన్నత విద్యాశాఖలో రుసా అర్హత నిధులు, ఇతర శాఖల నుంచి కూడా భారీగా నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే ప్రస్తుత ఆర్థిక సమస్యల కారణంగా ఎస్‌ఎన్‌ఎతో అనుసంధానం కలిగిన నిధుల విడుదలపైనే ముందుగా దృష్టి సారించాలని ఆర్థికశాఖ దాదాపుగా నిర్ణయించింది. దీంతో ఇతర నిధులు మార్చి 31లోగా వచ్చే అవకాశాలు లేవని స్పష్టమవుతోంది.

స్వాతిపై దాడి నిందితులకు రిమాండ్

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడుగా ఉన్న ఉమాశంకర్‌రెడ్డి భార్య స్వాతిపై దాడి చేసిన కొమ్మా పరమేశ్వరరెడ్డి, ఆయన కుమారుడు సునీల్ కుమార్‌రెడ్డిలను మంగళవారం జమ్మలమడుగు కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. న్యాయస్థానం వారికి 14 రోజులు రిమాండ్ విధించింది. మూడు రోజుల క్రితం వివేకా హత్య కేసులో నిందితుడుగా ఉన్న ఉమాశంకర్‌రెడ్డి భార్య స్వాతిపై కొమ్మా పరమేశ్వరరెడ్డి దాడి చేశారు. బాధితురాలు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీరిద్దరిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

అక్రమ నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



అక్రమంగా నాటుసారా తయారీ , నిల్వ , అక్రమ మద్యం, అక్రమ రవాణా, అమ్మకాలపై జిల్లా ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు గత(ఫిబ్రవరి) నెల రోజులుగా జిల్లా పోలీసు యంత్రాంగం, సెబ్ అధికారులు, స్పెషల్ పార్టీ పోలీసులు, సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించి విస్తృతంగా దాడులు చేశారని సెబ్ అడిషనల్ ఎస్‌పి కృష్ణకాంత్ పటేల్ మంగళవారం ఒక ప్రకటనలో వివరాలను విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా నాటుసారా నిర్మూలనకు జిల్లా పోలీసులు సమిష్టిగా ఫిబ్రవరి నెలలో నాటుసారా స్థావరాల పై విస్తృతంగా దాడులు నిర్వహించామన్నారు. నాటుసారా దాడులకు సంబంధించి 44 కేసులు, 61 మంది అరెస్టు , 496 లీటర్ల నాటుసారా సీజ్ , 3,680 లీటర్ల నాటు సారా బెల్లం ఊట ధ్వంసం చేసి, 5 వాహనాలు సీజ్ చేశామన్నారు. అక్రమ(తెలంగాణ, కర్ణాటక) మద్యం రవాణాపై దాడులకు సంబంధించి 188 కేసులు, 322 మంది అరెస్టు, 4,185 లీటర్ల మద్యం సీజ్, 49 వాహనాలు సీజ్ చేశారని తెలిపారు. నాటు స్థావరాలలోని నలుగురిని , అక్రమ మద్యం పై 39 మందిని, గంజాయి పై 65 మందిని బైండోవర్ చేశామని తెలిపారు. (బ్రీచ్ ఆఫ్ బాండ్)షరతులను ఉల్లంఘించిన ఇద్దరి పై బాండ్లు జప్తు చేసి రూ. 22 వేలు జరిమానా విధించామని పేర్కొన్నారు. నాటుసారా పై విస్తృతంగా గ్రామాలలో ఆర్‌ఎస్‌ఐ, 12 మంది స్పెషల్ పార్టీ పోలీసులచే దాడులు చేస్తున్నామన్నారు. ప్రజారోగ్యానికి హాని కలిగించే అక్రమ నాటుసారా తయారీ , అక్రమంగా మద్యం రవాణా, విక్రయాలకు పలుమార్లు పాల్పడే వ్యక్తులపై పిడి యాక్టులు కూడా నమోదు చేస్తామని సెబ్ అడిషనల్ ఎస్‌పి కష్ణ కాంత్ పటేల్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

కర్నూల్ ట్రాఫిక్ డిఎస్‌పి నాగభూషణం ,కర్నూల్ పుల్లయ్య ఇంజనీరింగ్ కాలేజ్ స్టూడెంట్స్‌కు ట్రాఫిక్ నియమాలపై ప్రొజెక్టర్ ద్వారా మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగభూషణం మాట్లాడుతూ పిల్లలకు ట్రాఫిక్ అవేర్నెస్ ప్రోగ్రాం చేసి లైసెన్స్ లేని విద్యార్థులకు వాహనాలు నడపరాదని ఏదైనా యాక్సిడెంట్ చేస్తే ఎ1, ముద్దాయిగా పోలీస్ కేసులో ఇరుకుంటారని పోలీస్ కేసులలో ఉన్న స్టూడెంట్‌కు ఎలాంటి గవర్నమెంట్ ఉద్యోగాలు రావని ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని విద్యార్థులకు తెలిపారు. స్నేక్ డ్రైవింగ్ ,రాంగ్ రూటు, సెల్ ఫోన్ డ్రైవింగ్ , త్రిబుల్ రైడింగ్ , అతివేగంగా వాహనాలను నడపడం చేయకూడదని అన్నారు. ఇన్సూరెన్స్ లేని ఎలాంటి వాహనాలు కూడా నడపరాదని , హెల్మెట్ ధరించి వాహనం నడపాలన్నారు. పాద చారులు ఎక్కడ పడితే అక్కడ రోడ్డు క్రాస్ చేయకూడదని, జీబ్రా లైన్స్ దగ్గరే రోడ్స్ క్రాస్ చేయాలన్నారు. పార్కింగ్ ప్లేసుల్లో మాత్రమే వాహనాలను పార్కింగ్ చేయాలన్నారు. లైసెన్స్ లేని విద్యార్థులకు మైనర్స్ కు తల్లిదండ్రులు కూడా వాహనాలు నడపడానికి, ఇవ్వకూడదని ఒకవేళ లైసెన్స్ లేని వ్యక్తులకు తల్లిదండ్రులు వాహనాలు ఇస్తే వారు ఆక్సిడెంట్స్ చేస్తే తల్లిదండ్రులు కూడా ముద్దాయిలు అవుతారని తెలిపారు. కాలేజీలో లైసెన్స్ లేని స్టూడెంట్స్కు వాహనాలు నడపటానికి అనుమతి ఇవ్వకూడదని స్టూడెంట్స్‌కు కాలేజీలో అలోవ్ చేయొద్దని ప్రిన్సిపాల్ కు, లెక్చరర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ , లెక్చరర్లు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



ఘనంగా అయ్యంకి వెంకటరమణయ్య వర్ధంతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం అయ్యంకి వెంకట రమణయ్య వర్ధంతిని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి వారిని వారి సేవలను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకొని ముందస్తుగా వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమం నందు ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు మద్దూర్ సుభాష్ చంద్రబోస్ , సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ , డిప్యూటీలైబ్రేరియన్ పెద్దక్క, గ్రంథాలయ అధికారులు, గోవిందరెడ్డి, బాష, చంద్రమ్మ, నషీమా తదితర ఉద్యోగులు ,కళాశాలల విద్యార్థులు, గ్రందాలయ పాఠకులు పాల్గన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల సమర్థవంతంగా నిర్వహించండి

రిటర్నింగ్ అధికారి ఎస్.రామ్ సుందర్ రెడ్డి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణను సమర్థవంతంగా ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారి , జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి రెవెన్యూ , నోడల్ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా రెవెన్యూ , నోడల్ అధికారులతో రిటర్నింగ్ అధికారి అనంతపురం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి సమీక్షించారు. రామ్‌సుందర్‌రెడ్డి రెడ్డి మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. పట్టభద్రులకు సంబంధించి రెండు కంపార్ట్మెంట్స్ ఏర్పాటు చేశామని, అదే విధంగా పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ఏజెంట్లకు సరైన సీటింగ్ ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించామన్నారు. పాఠశాలలో ఓటింగ్ కంపార్టుమెంటుకు అనువైన బల్లలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ఎలక్ట్రోల్ రిజిస్టర్‌లో నమోదుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయడంతో పాటు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో తప్పనిసరిగా వీడియోగ్రఫీ చేయిస్తామన్నారు. రూ. కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి పాల్గొన్న ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.నాగేశ్వర రావు, ట్రైనీ ఆర్‌డిఒలు, నోడల్ అధికారులు పాల్గన్నారు.

ఎద్దులు ఎత్తికెళ్ళిన గుర్తుతెలియని వ్యక్తులు..

ప్రజాశక్తి-తుగ్గలి

మండల కేంద్రమైన తుగ్గలి గుత్తి, పత్తికొండ ప్రధాన రహదారి పక్కన ఉన్న వాము దొడ్లలో కట్టేసిన రైతులకు చెందిన ఎద్దులను కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి సమయంలో హరిచంద్రకు చెందిన రెండు ఎద్దులు, సూర్యనారాయణరెడ్డి చెందిన ఒక ఎద్దు, సుధాకర్ రెడ్డికి చెందిన ఒక ఎద్దును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు రైతులు తుగ్గలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రైతుల మాట్లాడుతూ కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ఎద్దులను అపహరించారన్నారు. దీంతో రూ.లక్ష దాకా నష్టం జరిగిందని రైతులు వాపోయారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తుగ్గలి పోలీసులు తెలిపారు.

ఉద్యమ నేతలను ఎన్నుకోండి : జెల్లి విల్సన్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో కోటీశ్వరులు, కాంట్రాక్టర్లకు ఓటువేయవద్దని ఉ ద్యమనేతలను గెలిపించుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ కోరారు. రాయలసీమ ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలను గెలిపించాలని కోరుతూ మంగళవారం కర్నూలు ప్రైవేట్ పాఠశాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట ఎపి చేతివఅత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు, ఎస్‌టియు రాష్ట్ర ప్రదాన కార్యదర్శి హెచ్ తిమ్మన్న, ఎపి వ్యవసాయకార్మికసంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, ఎఐటియుసి జిల్లా ప్రదాన కార్యదర్శి ఎస్.మునెప్పలతో కలసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జల్లి విల్సన్ ఓటర్లనుద్దేశించి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉద్యమ నేతలను ఎన్నుకోవడం వలన ఉపాధ్యాయ సమస్యలతో పాటు నిరుద్యోగుల విద్యారంగ సమస్యల పరిష్కారానికి శాసనమండలిలో పోరాటం చేస్తారన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కతి నరసింహారెడ్డి గతంలో ఎమ్మెల్సీగా ఉన్న సమయం ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతోపాటు, గురుకుల, కస్తూరిభా, మోడల్ స్కూల్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం నిరంతరం పోరాటం చేశారన్నారు. రాయలసీమ పశ్చిమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తినరసింహారెడ్డి, పట్టబద్దుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు ఇరువురు ఉపాధ్యాయులే నని, ఉద్యమనేపథ్యం ఉన్న నేతలు కావడం వలన సమస్యలపై అవగాహన ఉంటుందన్నారు. అందుకే వారిని గెలిపించాలని కోరారు. నగరంలోని ఉస్మానియా కాలేజి, జేఎంజే స్కూల్, సెయింట్ జోసెఫ్ , జోసఫ్ డిగ్రీ, జూనియర్ కాలేజి, క్లారిటీ స్కూల్, సెయింట్ మెరీస్ జూనియర్ కాలేజిలలో ప్రచారం నిర్వహించారు.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి : ప్రజాసంఘాలు

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్



ప్రచారం చేస్తున్న గురుశేఖర్ , హుస్సేన్ తదితరులు

రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఓటు వేయాలని కర్నూలు నగరంలోని 45వ వార్డు ప్రేమ్ నగర్, లేబర్ కాలనీ అజీముద్దీన్ నగర్ పట్టుభద్రులను కలిసి పిడిఎఫ్ బలపరిచిన పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. పట్టభద్రులను, టీచర్ ఓటర్ల తో వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్ సి.గురుశేఖర్,డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు హుస్సేన్ బాష కెవిపిఎస్ న్యూ సిటీ కార్యదర్శి భాస్కర్, ఉపాధ్యక్షులు రోషన్న మాట్లాడుతూ ఉన్నత విద్యావంతులైన మేధావి వర్గం ప్రలోభాలకు గురికాకుండా రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఓటు వేయాలని కోరారు. విడిపోయిన ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా విభజన హామీలు అమలు చేయించ లేకపోవడం వల్ల రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని దీనికి ప్రధాన కారణం అధికార, ప్రతిపక్ష పార్టీలే బాధ్యత వహించాలని అన్నారు. ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి ప్రజల కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుకొచ్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల తల నారాజుకు. కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వారు కోరారు. పోతల నాగరాజును 198 ప్రజాసంఘాలు జనసేన కాంగ్రెస్ పార్టీలు బలపరుస్తున్నాయని ఆయన గెలుపు తధ్యమని చెప్పారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోతుల నాగరాజును గెలిపించండి : సిఐటియు

గూడూరు: స్థానిక గూడూరు నగర పంచాయతీలో మంగళవారం సిఐటియు డివిజన్ కార్యదర్శిజె. మోహన్ వీరి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు గెలుపుకు కృషి చేస్తూ స్థానిక గూడూరు నగర పంచాయతీలో ఓటర్లకు ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. పోతుల నాగరాజుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. పోతుల నాగరాజు గతంలో మాజీ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా సాగించారని ఆయనకు ప్రజలపై కార్మికులపై అవగాహన కలిగిన వ్యక్తి ఏకైక వ్యక్తి మన పోతుల నాగరాజు అన్నారు. దానమన్న, అబ్రహం, తదితరులు సిఐటియు నాయకులు పాల్గొన్నారు

భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.కోటి ఇవ్వాలి

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

జాతీయ రహదారి పనులలో భాగంగా కర్నూలు మండలం, తాండ్రపాడు, రుద్రవరం, పసుపల, నూతనపల్లె, గార్గేయపురం గ్రామాల్లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారంగా ఎకరానికి రూ. 1కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని టిడిపి కర్నూలు మండల కన్వీనర్ బుర్ర వెంకటేష్ నాయుడు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతుల జీవితంతో ముడిపడి ఉన్న జీవనాధారమైన భూములను జాతీయ రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వం భూసేకరణ చేసిందని ప్రభుత్వం ఎకరాకు తక్కువ ధరను చెల్లించి చేతులు దులుపుకో చూస్తోందన్నారు. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు చేస్తున్న తీవ్ర అన్యాయమని విమర్శించారు. భూములు కోల్పోయిన రైతులకు ఎకరానికి రూ. కోటి చెల్లించాలని, లేదంటే ఆ గ్రామ రైతులతో కలిసి తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నియోజకవర్గ అధికార ప్రతినిధి విజయ్ కుమార్, మాజీ ఎంపిటిసి ఎం.నాగరాజు, కర్నూలు పార్లమెంట్ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు సయ్యద్ బాషా, ఎస్సీ సెల్ నాయకుడు గొందిపర్ల శీను పాల్గొన్నారు.

సూక్ష్మ పరిశీలకుల పాత్ర ఎంతో కీలకం

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

శాసన మండలి ఎన్నికలలో పోలింగు నియమావళి అమలులో సూక్ష్మ పరిశీలకుల పాత్ర ఎంతో కీలకమని మైక్రో అబ్జర్వర్స్ నోడల్ అధికారి సిపిఒ అప్పలకొండ పేర్కొన్నారు.మంగళవారం కలెక్టరేట్లోని సునయన ఆడిటోరియంలో ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వహించడానికి నియమించిన సూక్ష్మ పరిశీలకులకు(మైక్రో అబ్జర్వర్స్) మైక్రో అబ్జర్వర్స్ నోడల్ అధికారి , సిపిఒ అప్పలకొండ, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, ఎల్‌డిఎం వెంకటనారాయణలు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సిపిఒ అప్పలకొండ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈనెల 13న జరుగనున్న పట్టబద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ పోలింగ్ నేపథ్యంలో 27 ఎమ్మెల్సీ టీచర్ పోలింగ్ కేంద్రాలు, 74 పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలను సజావుగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిపేందుకు జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశాల మేరకు మైక్రో అబ్జర్వర్స్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. మాస్టర్ ట్రైనర్స్ సలీం భాష, సిద్దలింగమూర్తి ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా ఆయా అంశాలకు సంబంధించి ఏయే ఫార్మేట్లలో నివేదికలు ఇవ్వాలన్న విషయంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలలో సూక్ష్మ పరిశీలకులు వెలిబుచ్చిన సందేహాలకు నోడల్ అధికారి తగు పరిష్కారాలను సూచించారు. ఈ కార్యక్రమంలో మైక్రో అబ్జర్వర్స్, , జిల్లా అధికారులు పాల్గొన్నారు.



నగరంలో ఎమ్మెల్యే విస్తృత పర్యటన

ప్రజాశక్తి -కర్నూలు క్రైమ్: కర్నూలు నగరంలో ఎమ్మెల్యే ఆఫీస్ ఖాన్ పలు వార్డుల్లో విస్తృతంగా పర్యటించి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. ఈనెల13న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో పోటీచేస్తున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వేయించి అఖండమైన మెజారిటీతో గెలిపించాలని కోరారు. 51,14,15,16,18 వార్డుల్లో ఇసిఎం కాంపౌండ్, బుధవారపేట , జోహారాపురం, వీధిలోని పట్టభద్రులు వారి ప్రతి ఇంటికి తిరుగుతూ ఓటును అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక వార్డు కార్పొరేటర్లు, వార్డ్ ఇన్చార్జులు, 18వ వార్డ్ కార్పొరేటర్ పల్లవి,46వ వార్డ్ కార్పొరేటర్ వాసు, 14వ వార్డ్ కో ఆప్షన్ మెంబెర్ శ్రీరాములు, నయీమ్ పాషా, వైఎస్ఆర్ సేవా దళ్ జిల్లా అధ్యక్షులు కేదార్ నాథ్, పవన్, పప్పి, కృష్ణ కాంత్ శర్మ, వార్డు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

రాతన ఇల్లుకు నష్ట పరిహారం చెల్లించాలి : కోట్ల

ప్రజాశక్తి-తుగ్గలి

మండలం పరిధిలోని రాతన గ్రామంలో సోమవారం చీలి పగుళ్లు వచ్చి దెబ్బతిన్న ఇల్లుకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన రాతన గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చీలిన ఇల్లును, సిమెంట్ రోడ్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాతన గ్రామంలో దెబ్బతిన్న ఇల్లుకు తక్షణమే ప్రభుత్వం నష్టపరహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూమి ఎందుకు కదిలింది అనే విషయాలపై నిపుణులు చేత విచారణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మనోహర్ చౌదరి, గోవింద్ రెడ్డి, కృష్ణమూర్తి చౌదరి, పెండేకల్ భాస్కర్ రెడ్డి, వైవి ప్రభాకర్ రెడ్డి ప్రమోద్ కుమార్ రెడ్డి, టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు చందోలి తిరుపాల్, తిరుపాల్ నాయుడు పాల్గొన్నారు.





దిగువ అహోబిలంలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మహిళలే మహారాణులు

- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- పోరాటం నుంచే మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/నంద్యాల కలెక్టరేట్

మహిళలు అన్నింటా పురుషులతో పాటు సమానంగా పోటీ పడుతున్నారు. అన్ని రంగాల్లో రాణిస్తూ మహారాణులుగా నిలుస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మార్చి 8న జరుపుకుంటారు. మహిళల విజయాలు సెలబ్రేట్ చేసుకోవడానికి ఈ రోజును ప్రత్యేకంగా జరుపుకుంటారు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

అమెరికాలోని న్యూయార్క్ నగరంలో 1909 ఫిబ్రవరి 28న అమెరికన్ సోషలిస్ట్ పార్టీ జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంది. కార్మిక కార్యకర్త థెరిసా మల్కియెల్ ఈ రోజును ప్రతిపాదించారు. నగరంలోని రెడీమేడ్ గార్మెంట్స్ కార్మికులపై జరుగుతున్న అణచివేతను ఖండిస్తూ దినోత్సవాన్ని ప్రారంభించారు. దీని ప్రాముఖ్యతను చూసి ముగ్గురయిన అమెరికన్ సోషలిస్ట్ నాయకులు మహిళా దినోత్సవాన్ని జరుపుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. అయితే, ఆ సమయంలో నిర్దిష్ట తేదీని నిర్ణయించలేదు. ఈ నేపథ్యంలో 1975, 1977లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐరాస నిర్ణయించింది. ఆ సంస్థ సంబరాలు ప్రారంభించింది. తదనంతరం, ఐక్యరాజ్యసమితి మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించింది. మహాసభ ప్రకటించింది. ఈ రోజున మహిళల హక్కులను కాపాడేందుకు, ప్రపంచవ్యాప్తంగా మహిళలు శాంతియుతంగా జీవించేందుకు చర్యలు తీసుకోవడానికి కట్టుబడి ఉంది. దీని తర్వాత ప్రతి సంవత్సరం మహిళా దినోత్సవం సందర్భంగా కొత్త థీమ్‌ను ప్రవేశపెడుతున్నారు. మహిళలు సాధించిన విజయాల గురించి మాట్లాడమే కాకుండా, లింగ ఆధారిత భేదాలు, సమానత్వం లక్ష్యం, మహిళల హక్కులు మొదలైన వాటి గురించి కూడా ఈ రోజున అవగాహన కల్పిస్తారు. మహిళా సంక్షేమం కోసం దృష్టి సారించిన వివిధ మహిళా సంఘాలు ఈ రోజున



నిధులు సమకూరుస్తున్నాయి.

ఆమెదే ఆధిక్యం
- 10 నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే ఎక్కువ

ఉమ్మడి జిల్లాలోని ఓటర్లలోనూ ఆమెదే ఆధిక్యం. జిల్లా వ్యాప్తంగా మొత్తం 33.44 లక్షల మంది ఓటర్లు ఉండగా 14 నియోజకవర్గాల్లో 10 నియోజకవర్గాల్లో మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది. ఆళ్లగడ్డ, నందికొట్కూరు, కర్నూలు, పాణ్యం, నంద్యాల, బనగానపల్లె, డోన్, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా కూడా మహిళా ఓటర్ల సంఖ్యనే ఎక్కువగా ఉంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 33,44,950 మంది ఓటర్లు ఉండగా అందులో 16,57,114 మంది పురుషులు, 16,87,244 మంది మహిళలు, 592 మంది స్త్రీలు ఉన్నారు. 49.54 శాతం మంది పురుష ఓటర్లు ఉండగా 50.44 శాతం మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఇతర ఓటర్లలో అత్యధికంగా నంద్యాలలో 104 మంది ఉన్నారు. అత్యధికంగా పాణ్యం నియోజకవర్గంలో 3,09,204 మంది ఓటర్లు ఉండగా శ్రీశైలం నియోజకవర్గంలో 1,92,380 మంది ఓటర్లు ఉన్నారు.

పట్టభద్రుల్లో 56.54 శాతం మహిళా ఓటర్లు

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ సాగుతోంది. ఇప్పటికే పోటీలో నిలిచే అభ్యర్థుల జాబితా ఖరారు కావడంతో అభ్యర్థులు ప్రచారం మునిగిపోయారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,178 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో మహిళలే అధికంగా ఉన్నారు. ఉమ్మడి జిల్లాలోని పట్టభద్ర ఓటర్లలో 512 మంది పురుషులు, 666 మంది మహిళలు ఉన్నారు. అన్ని రెవెన్యూ డివిజన్లలోనూ పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది. మొత్తం ఓటర్లలో అత్యధికంగా ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌లో 268 మంది ఓటర్లు ఉండగా అత్యల్పంగా పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లో 144 మంది ఓటర్లు ఉన్నారు.

పురుషులతో సమానంగా అంతరిక్షంలోకి మహిళలు



ఒకప్పుడు మహిళలను వంటింటి కుందేలుగా చూసేవారు. కానీ పరిస్థితి మారింది. పురుషులతో సమానంగా శాటిలైట్ ద్వారా ఉపగ్రహాల్లోకి రోదసి యాత్రల్లోకి మహిళలు పయనిస్తున్నారు. మహిళా సాధికారత వచ్చింది. ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. ప్రతి చోట పురుషులతో సమానంగా మహిళలు విజయం సాధిస్తున్నారు.

అనురాధ, జిల్లా విద్యాశాఖ అధికారి.

ఆవని నుండి అంతరిక్షం వరకు



ఆవని నుండి అంతరిక్షం వరకు ఎదుగుతూ అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు. సమాన అవకాశాలు కల్పిస్తే సమాజాభివృద్ధిలోను, సాధికారతలోనూ ముందుంటారు. అక్షరాస్యతలోనూ మహిళలు ముందుండాలి. మహిళల రక్షణకు ప్రభుత్వాలు అనేక రకాల చట్టాలను అమలు చేస్తున్నాయి. అవసరమైనప్పుడు ఆ చట్టాలను ఉపయోగించుకోవాలి. చదువుతోపాటు ఉద్యోగం ఉపాధి వంటి అవకాశాల్లో మహిళలను ప్రోత్సహించాలి. మహిళలు ఆత్మవిశ్వాసం ఆత్మస్థైర్యం కలిగి ఉండి సమస్యలు, ఒడిదొడుకులు వచ్చినప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలి. సమాజం మహిళల పట్ల వివక్ష చూపకుండా మగవారితో సమానం అనే అవగాహనతో ముందుకు సాగాలి. ప్రోత్సహించాలి.

మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలి



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నా నేటికీ మహిళలకు హక్కులు కల్పించడంలో ప్రభుత్వాలు ఇంకా వెనుకబడి ఉన్నాయి. పని ప్రదేశాలలో యజమానుల వలన మహిళా కార్మికులపై వేధింపులు, అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయి. అసంఘటిత మహిళా కార్మికులకు తక్కువ వేతనాలు ఇచ్చి శ్రమ దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వం మద్యం అమ్మకాలను ప్రోత్సహించడం వలన తాగి వచ్చి భార్యలపై దాడులకు పాల్పడుతూ కుటుంబాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. కాలేజీలలో ర్యాగింగ్‌ను, విద్యార్థినిల పట్ల దాడులను అరికట్టాల్సిన ప్రభుత్వాలు చట్టాలకే పరిమితమవుతున్నాయి తప్ప వాటిని కఠినంగా అమలు చేయడంలో చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదు.. పేరుకే మహిళా సాధికారత అంటున్నారు కానీ నిజమైన మహిళ ఆర్థిక స్వాలంభన సాధించే దిశగా ప్రభుత్వాలు, పాలకులు కషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

టి.నిర్మల, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు.

రమణీయం.. ప్రహ్లాద వరదుని రథోత్సవం

- వేలాదిగా హాజరైన భక్తులు.. పాల్గొన్న మండలి విప్, ఎమ్మెల్యే
- ఎగువలో గరుడోత్సవంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన దిగువ అహోబిలంలో మంగళవారం ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి భూదేవి అమ్మ వార్ల రథోత్సవం రమణీయంగా జరిగింది. ఉత్సవమూర్తులు ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించి అనంతరం రథంలో ఆశీనులను చేసి అహోబిల మాడ వీధుల గుండా రథోత్సవం నిర్వహించారు. రథానికి ముందుగా అహోబిలం మఠం పీఠాధిపతి పూజలు నిర్వహించారు. అనంతరం మండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల నానిలు కొబ్బరి కాయలు కొట్టి రథం తాడు లాగి రోథోత్సవాన్ని ప్రారంభించారు. రథోత్సవం రథమండపం నుండి అహోబిలం మాడవీధుల గుండా తిరిగి మళ్లీ రథ మండపం చేరుకుంది. ప్రధాన అర్చకులు వేణుగోపాల చార్యులు మాట్లాడుతూ కల్యాణోత్స వాన్ని తిలకించలేని భక్తులు రథోత్సవంలో తిలకించి స్వామి అమ్మ వార్లను దర్శించుకుంటా రన్నారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆళ్లగడ్డ డిఎస్‌పి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఉత్సవమూర్తులను దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

ఎగువ అహోబిలంలో : ఎగువ అహోబిలంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా జ్వాలా నరసింహ స్వామి, శ్రీదేవి,భూదేవి అమ్మ వార్లకు ఉదయం ఉత్సవం నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం ద్వాదశరాధనం, పుష్పయాగం కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి గరుడ వాహనంపై జ్వాల నరసింహ స్వామిని ఆశీనులను చేసి పూజలు నిర్వహించి అనంతరం ఊరేగింపు నిర్వహించారు. ధ్వజ అవరోహణం కార్యక్రమంతో ఎగువలో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

విధులతో పాటు ఆటల్లోనూ రాణించాలి

- జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి
- ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మహిళలు విధులతో పాటు ఆటల్లోనూ రాణించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నంద్యాల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు రెవిన్యూ మహిళా విభాగం, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ ఆటల పోటీలను జాయింట్ కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఆటల పోటీలు మహిళలకు ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని ఇచ్చేందుకు దోహద పడతాయని అన్నారు. పోటీలు ఆహ్లాదకరమైన వాతావరణంలో జరుగుతున్నాయని చెపాపరు. ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'లింగ సమానత్వంపై దృష్టి, ప్రతి సమాజం డిఎన్ఎలో భాగం కావాలి. ఈక్విటీ.. ఈక్వాలిటీ మధ్య వ్యత్యాసాన్ని అర్థం చేసుకోవడం చాలా కీలకం' అనే నినాదాన్ని ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జెసి మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకురాలు నాగమణి మాట్లాడుతూ మహిళల్లో మానసిక ఒత్తిడిని తట్టుకునేందుకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టెన్నికాయిట్, త్రో బాల్ డిస్క్, చాట్ పుట్, షటిల్, తగ్గాఫర్, మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్ తదితర ఆటలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ లీలావతి మాట్లాడుతూ నేడు బుధవారం ఉదయం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు. ఈ ఆటల పోటీల్లో ఐసిడిఎస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న జెసి



మోసపూరిత ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో డబ్బు పెట్టకండి

- సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోవద్దు
- జిల్లా ఎస్‌పి కె. రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మోసపూరిత ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో డబ్బులు పెట్టి, సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోవద్దని జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి ప్రజలకు సూచించారు. మంగళవారం సైబర్ నేరాలపై జిల్లా ఎస్‌పి తన క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నాను, మీ వివరాలు ఇవ్వండి అని ఫోన్ వస్తే మీరు ఆశపడి ఆకర్షితులైతే సైబర్ నేరగాళ్ల చేతిలో నిలువుదోపిడికి గురయ్యే అవకాశం ఉందన్నారు. మోసపూరిత ఆన్‌లైన్ ట్రేడింగ్లో డబ్బులు పెట్టి మోసపోవద్దన్నారు. డబ్బులు పోయాక బాధపడడం కంటే అవగాహనతో వ్యవహరించి జాగ్రత్త పడటం మంచిదన్నారు. సైబర్ మోసం జరిగిన వెంటనే నంద్యాల సైబర్ ల్యాబ్‌కు లేదా 1930కి కాల్ చేస్తే మోసపూరిత డబ్బు సైబర్ నేరగాళ్ల చేతికి పోకుండా ఫ్రీజ్ చేయవచ్చునని లేదా ఎన్‌సిఆర్‌పి పోర్టల్ (www.cybercrime.gov.in)లో ఫిర్యాదు చేస్తే సంబంధిత పోలీస్ స్టేషన్ వారు తక్షణమే స్పందిస్తారని చెప్పారు. బ్యాంక్ అక్కౌంట్ నెంబర్‌ను ఓటిపి (ఒన్ టైమ్ పాస్వర్డ్)ను, బ్యాంక్ పిన్ నెంబర్‌ను, సిసివి నెంబర్‌ను ఎవరితోనూ పంచుకోరాదన్నారు. ప్రస్తుత పరిస్థితులలో ప్రతి లావాదేవీ వివిధ ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా జరుగుతున్నాయని, కావున ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన సున్నితమైన విషయాలను ఓటీపీ, పాస్వర్డ్, బ్యాంక్ అకౌంట్ వివరాలు, సిసివి నంబర్స్, తెలియని వ్యక్తుల నుండి మెసేజ్‌లలో, మెయిల్స్‌లో వచ్చిన తెలియని లింకులపై, సామాజిక మాధ్యమాలలో వచ్చే లింక్స్‌ని క్లిక్ చేసి మోసపోవద్దని సూచించారు. నిబంధనలు పాటిస్తూ సైబర్ నేరాలపై జాగ్రతగా ఉండాలని జిల్లా ప్రజలకు తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి



వృషభాల రాష్ట్ర స్థాయి బల ప్రదర్శన పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా దిగువ అహోబిలంలోని జిల్లా పరిషత్ మైదానంలో వృషభ రాజముల రాష్ట్రస్థాయి బల ప్రదర్శన పోటీలను శాసనమండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, శాసనసభ్యులు గంగుల బ్రిజేంద్ర రెడ్డి, గంగుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డి తనయుడు గంగుల భరత్ రెడ్డిలు మంగళవారం ప్రారంభించారు. కెడిసిసి బ్యాంక్ డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు, మండల ఉపాధ్యక్షులు నాసారి ప్రసాద్, సర్పంచ్ నాసారి వీరమ్మల ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనమండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, శాసనసభ్యులు గంగుల బిజేంద్రా రెడ్డిలు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు మన ప్రాంత సంస్కృతి, సాంప్రదాయాలను పెంపొందిస్తాయన్నారు.. ఈ పోటీలకు కార్యనిర్వాహకులుగా కేంద్ర కాటన్ బోర్డు మాజీ సభ్యులు శ్రీనివాసరెడ్డి (వాసు), మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డిలు వ్యవహరించారు. అంతకు ముందుగా శాసనమండలి విప్, ఎమ్మెల్యే రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి గజ్జల రాఘవేంద్రారెడ్డి, యాదవాడ నరసింహారెడ్డి, సుబ్బు, భాస్కరరెడ్డి, బుడ్డా చంద్ర మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పప్పు శనగ కేంద్రాలను ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - అవుకు : అవకులో పప్పు శనగల కేంద్రాలను ఏర్పాటు చేయాలని మండల రైతులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. మండలంలో 2700 హెక్టార్లలో పప్పు శగన సాగు చేశారు. ప్రస్తుతం శనగ ధర బయట మార్కెట్లో క్వింటా రూ. 4600 ధర పలుకుతుందని, ప్రభుత్వ మద్దతు ధర రూ.5300 ధర ఉండటంతో పప్పు శనగ కేంద్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని మండల రైతులు కోరుతున్నారు.

టిడిపి నాయకునికి బిసి రాజారెడ్డి పరామర్శ

ప్రజాశక్తి - బనగానపల్లె : పట్టణంలోని టిడిపి నాయకులు గాజుల రసూల్ అలియాస్ పలుకూరు సైకిల్ షాప్ భాష అనారోగ్యంతో సికింద్రాబాద్ వైద్యశాలలో చికిత్స చేయించుకొని ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటుండగా విషయం తెలుసుకున్న బనగానపల్లె మాజీ సర్పంచ్ బి.సి. రాజా రెడ్డి వారి ఇంటికి వెళ్లి మంగళవారం పరామర్శించారు. వారి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు.

రెండో రోజూ కనిపించని పులి పిల్లల తల్లి

- పిల్లలను తల్లి వద్దకు చేర్చడమే లక్ష్యం
- నల్లమలలో ముమ్మరంగా గాలింపు

ప్రజాశక్తి - కొత్తపల్లి

కొత్తపల్లి మండలం పెద్దగుమ్మడాపురం నల్లమల అడవి సమీప సోమవారం 4 పులి పిల్లల తల్లికోసం గాలింపు ముమ్మరం చేశారు. పులి పిల్లలు క్షేమంగానే ఉన్నాయి. పిల్లల తల్లి రెండో రోజు పులి కనిపించకపోవడంతో అధికారుల బృందం నల్లమల అడవుల్లో ముమ్మరంగా గాలిపు చర్యలు చేపట్టారు. సోమవారం రాత్రంతా ఫారెస్ట్ అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కెమెరాలతో తనిఖీలు చేశారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం దాకా నల్లమల్ల ఫారెస్ట్ మొత్తం జల్లడ పట్టినప్పటికీ పులి జాడ కనిపించలేదు. సోమవారం రాత్రి పులి జాడ కోసం నల్లమల ఫారెస్ట్ లో సుమారు 40 కెమెరాలను అమర్చి పరిశీలన చేసినప్పటికీ ఎక్కడ కూడా పులి ఆచూకీ లభ్యం కాలేదు. రాత్రి సమయంలో పెద్ద గుమ్మడాపురం గ్రామానికి చెందిన గ్రామస్తులు గ్రామంలోకి పిల్లల కోసం పులి ఎప్పుడు వస్తుందో అని రాత్రంతా జాగరణ చేశారు.

పులి పిల్లలను తల్లి వద్దకు క్షేమంగా చేరుస్తాం
శ్రీశైలం అటవీశాఖ ఫీల్డ్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి

పులి పిల్లలు క్షేమంగా ఉన్నప్పటికీ పులి ఆచూకీ మాత్రం కనిపించలేదు. పులి జాడ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రాత్రి ఆరు గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు కెమెరాలతో ప్రత్యేక బందాలు గాలింపు చర్యలు చేస్తున్నాయి. ఉదయకాలంలో మరి కొంతమంది ఫారెస్ట్ అధికారులు నల్లమల అడవిలోకి వెళ్లి కెమెరాలను పరిశీలించి పులి జాడలు ఏమైనా ఉన్నాయని తిరిగారు. మంగళవారం సాయంత్రం డిఎఫ్ఒ టేరాన్ ఆధ్వర్యంలో ఆచూకీ కోసం ఫారెస్ట్ వెంట తిరగడంతోపాటు ఫారెస్ట్ సమీపంలో ఉన్న వ్యవసాయ పొలాలను పరిశీలించారు. అంతవరకు సమీప గ్రామానికి చెందిన గ్రామస్తులు వ్యవసాయ రైతులు ఏదైనా ఆచూకీ తెలిస్తే వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వాలి. పులి పిల్లలను ఫారెస్ట్ అధికారులకు అప్పజెప్పిన వారితో కూడా మాట్లాడుతున్నాం. రాత్రి కూడా పులి జాడ కోసం దాదాపు 100 కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం. ఈ తనిఖీల్లో మార్కాపురం డిఎఫ్ఒ అయ్యప్ప సున్నిపెంట బయోడైవర్సిటీ రేంజ్ అధికారి మహమ్మద్ హయత్ రేంజర్లు పట్టాభిస్థానిక ఎఫ్ఎస్ఒ నాగేశ్వరరావు, ఫారెస్ట్ అధికారులు సిబ్బంది ఉన్నారు.



పులి కోసం గాలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- డిఎంహెచ్ఒ డాక్టర్ వెంకటరమణ

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

మలేరియా, డెంగ్యు, మెదడువాపు జ్వరాలు గ్రామాల్లో ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఆర్.వెంకటరమణ వైద్యులకు సూచించారు. మంగళవారం నంద్యాల మండలం మద్దూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సమావేశాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమీక్షలో భాగంగా ఎన్‌సిడి-సిడి సర్వే నిర్వహించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనీమియా టూల్ మానిటరింగ్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. మలేరియా, డెంగ్యు, మెదడువాపు జ్వరాలు గ్రామాల్లో ప్రబలకుండా జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. ప్రతి గ్రామంలో డ్రై డే - డ్రై డే కార్యక్రమాన్ని వందశాతం పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి గ్రామంలో వడ దెబ్బ పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఆర్‌బిఎస్‌కె, ఆర్‌కెఎస్‌కె కార్యక్రమంలో భాగంగా స్కూల్స్‌లో ఉన్న ప్రతి విద్యార్థికి వంద శాతం స్క్రీనింగ్ నిర్వహించాలని తెలిపారు. మాతా శిశు సంరక్షణ చర్యలు హెచ్ఎంఐఎస్, ఆర్‌సిహెచ్, సిఎస్ఎస్ఎం పోర్టల్‌లో వందశాతం అప్‌లోడ్ చేయాలన్నారు. మాతృ మరణాలు, శిశు మరణాలు జరగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.



మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ డాక్టర్ వెంకటరమణ

ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేయండి

- జిల్లాలో 61 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు
- 30 ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాలు : జెసి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును నిర్భయంగా ఉపయోగించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి పేర్కొన్నారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 13న జరిగే పశిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 91 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అందులో 61 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు, 30 ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. పట్టభద్రుల ఓటర్లు 51,929 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 4,426 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. నామినేషన్లు ముగిసిన తర్వాత పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీకి 49 మంది, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీకి 12 మంది పోటీలో ఉన్నట్లు వెల్లడించారు. సెక్టోరల్ ఆఫీసర్లను, రూట్ ఆఫీసర్లను నియమించడంతోపాటు మోడల్ కోడ్ కండక్ట్, ఎఫ్ఎసి కమిటీలను నియమించామన్నారు. జంబు బ్యాలెట్ బాక్సులు, బిగ్ బాక్సులు అందుబాటులో ఉంచామని, రెండు కంపార్ట్మెంట్‌లు పెట్టామన్నారు. ఎన్నికల నిబంధనవాళి పక్కాగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 570 మంది సిబ్బందికి ఎమ్మెల్సీ ఎన్నికలపై శిక్షణ ఇచ్చామన్నారు.

ఉచిత ఫిజియోథెరపీ వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

అహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా క్షేత్రంలో ఆళ్లగడ్డకు చెందిన వేద ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో ఉచిత ఫిజియోథెరపీ వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ నరేంద్ర దేవ్ , డాక్టర్ ఎం.సుబ్బ నరసయ్యలు పాల్గొని కీళ్ల కండరాల నొప్పులతో బాధపడుతున్న వారికి పలు సూచనలు, వ్యాయామాలు చేయించి, నివారణకు తైలములు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవ సేవకులు శ్రీనాథ్ శర్మ, గంగిరెడ్డి, సుబ్బారావు, హిందూ అన్నసత్రం మధుసూదన్ రెడ్డిలు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్న దృశ్యం





రైతు దుబ్బా వెంకటరామిరెడ్డిని సన్మానించిన కృష్ణవేణి సీడ్స్ కంపెనీ ఎండి

మిర్చి రైతుకు సన్మానం

ప్రజాశక్తి - సంజామల : మండలంలోని ఆకుమల్ల గ్రామానికి చెందిన రైతు దుబ్బా వెంకటరామిరెడ్డి మిర్చి పంటలో అధిక దిగుబడి సాధించడంతో కృష్ణవేణి సీడ్స్ వారి ఎండి శంకర్ రెడ్డి షీల్డ్, బహుమతి అందజేసి శాలువాతో ఘనంగా మంగళవారం సన్మానించారు. వివరాలు.. రైతు దుబ్బా వెంకట రామిరెడ్డి ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని మిరప పంట సాగు చేశాడు. ఎకరాకు 35 క్వింటాళ్ల నుంచి 40 క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. ప్రస్తుతం ఎండు మిర్చి కేజీ ధర 200 రూపాయలు ఉంది. 35 క్వింటాళ్ల దిగుబడి రావడంతో ఖర్చు రెండు లక్షల రూపాయలు పోను రూ. 5 లక్షలు లాభం వస్తుందని రైతు తెలిపారు. కృష్ణవేణి సీడ్స్ వారి ఎండి శంకర్ రెడ్డి రైతును సన్మానించడంతో ఆకుమల్ల గ్రామ రైతులు అభినందించారు. కార్యక్రమంలో రైతులు కాసిం, పుల్లారెడ్డి, నాగేశ్వర్ రెడ్డితో పలువురు రైతులు పాల్గొన్నారు.

టిడిపి నాయకునికి మాతృ వియోగం

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని కటికవానికుంట గ్రామానికి చెందిన టిడిపి నాయకులు బాలరాజు యాదవ్ మాతృమూర్తి సాలమ్మ (70) మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరా, అంబాపురం సర్పంచి కుమ్మరి శ్రీనివాసులు యాదవ్‌లు అక్కడికి చేరుకుని సాలమ్మ మృతదేహానికి నివాళు లర్పించారు. వారి వెంట టిడిపి నాయకులు పర్లపాటి చంద్ర యాదవ్, చెంచు బోయిన వెంకట రాముడు ఉన్నారు.

అంధులకు బిసి రాజారెడ్డి ఆర్థికసాయం

ప్రజాశక్తి - బనగానపల్లె : బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచి బిసి రాజారెడ్డి అంధులకు అండగా నిలబడి ప్రతి నెలా వారికి పెన్షన్ రూపంలో ఆర్థిక సాయం అందజేస్తున్నారు. మంగళవారం మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి ఆధ్వర్యంలో నంద్యాలలోని సెయింట్ లూక్స్ అంధుల పాఠశాలలోని 19 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి నెలకు రూ. 500 చొప్పున పించన్ ఐదు నెలలకు సంబంధించి రూ.47,500 బొబ్బల మహేశ్వర రెడ్డి పంపిణీ చేశారు. విద్యార్థులు బిసి రాజా రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అందులకు పించన్లను పంపిణీ చేస్తున్న దృశ్యం



ఎన్నికల కోడ్ అమలులో అధికారులు వైఫల్యం : వ్యకాసం

ప్రజాశక్తి - నందికొట్కూరు



రేషన్ పంపిణీ వాహనంపై ఉన్న సీఎం ఫోటోను చూపిస్తున్న వ్యకాసం నాయకులు

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను అమలు చేయడంలో అధికారులు విఫలం చెందారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పీ పకీర్ సాహెబ్ అన్నారు. మంగళవారం పట్టణంలో ఉన్న వివిధ కాలనీలో ఎమ్మెల్సీ ఓట్ల కోసం పర్యటన సందర్భంగా వ్యకాసం నాయకులు మాట్లాడారు. పట్టణంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను అధికారులు అమలు చేయడం లేదని, ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశంలో, ప్రభుత్వ పథకాలకు సంబంధించి సీఎం, మంత్రులు, ప్రజాప్రతినిధులు ఫోటోలు తొలగించడం లేదన్నారు. రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. రేషన్ పంపిణీ వాహనంపై ముఖ్యమంత్రి ఫోటోలను తొలగించడం లేదు అని పేర్కొన్నారు. ఎన్నికల అధికారులు పక్షపాతి వైఖరి అవలంబిస్తున్నారని విమర్శించారు. వ్యకాసం మండల ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.


పకీరయ్యను సన్మానిస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

బాధ్యతతో పని చేస్తే అందరి మన్ననలు పొందవచ్చు

- ఆర్‌టిసి డోన్ డిపో ఎస్‌టిఐ జె.పకీరయ్య

ప్రజాశక్తి - డోన్

బాధ్యతతో పనిచేస్తే అందరి మన్ననలు పొందవచ్చని ఆర్‌టిసి డోన్ డిపో ఎస్‌టిఐ జె.పకీరయ్య పేర్కొన్నారు. మంగళవారం డోన్ డిపోలో పనిచేస్తున్న ఎస్‌టిఐ జె. పకీరయ్య రిలీవింగ్‌పై రాయదుర్గం స్క్వాడ్ ఇన్చార్జిగా రిలీవ్ అవుతున్న సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ డోన్ డిపో సెక్రెటరీ ఐవిఆర్.రెడ్డి ఆధ్వర్యంలో పూలమాలతో శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ డోన్ డిపో సెక్రెటరీ ఐవిఆర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల పట్ల ఎంతో ప్రేమానురాగాలు చూపడం అభినందనీయం అన్నారు. ఆర్టీసీ కార్మికులతో మమేకమై ప్రతి పనిని బాధ్యతగా పనిచేయడం అభినందనీయమన్నారు. ప్రతి కార్మికునికి అండగా నిలబడి వారి బాగోగులు చూడడం ఎంతో గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రమణారెడ్డి,చాంద్ బాషా,ఎంఎస్. నారాయణ, ఏఎస్.కుమార్, పి.దాస్, నాగేంద్ర, ఓకే రెడ్డి, టిఐ 3 ఎస్ఎం జిలాని, ఎడిసిలు డి.చంద్రుడు, రంగస్వామి,బిఎస్ఎస్ వి రాజు తదితరులు పాల్గొన్నారు.


అబూబక్కర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మైనారిటీ సెల్ జోనల్ ఇంఛార్జ్

అబూబక్కర్‌కు అభినందన సభ

ప్రజాశక్తి - నందికొట్కూరు

కర్నూలు, నంద్యాల జిల్లాల మైనారిటీ సెల్ జోనల్ ఇంఛార్జ్‌గా అబూబక్కర్ ఎన్నికైన సందర్భంగా మైనార్టీ నాయకులు స్థానిక ముబారక్ ఫంక్షన్ హాలు నందు అభినందన సభ మంగళవారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, మైనారిటీ నాయకులు, ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో అబూబక్కర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అబూబక్కర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్‌కు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పగిడ్యాల మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, మైనారిటీ నాయకులు మోమిన్ మన్సూర్, కౌన్సిలర్‌లు, మైనారిటీ సంఘాలు, స్నేహితులు, వార్డు ఇంచార్జ్ లు, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



నేచురోపతి గురించి మాట్లాడుతున్న డాక్టర్ మురళీధర్ రెడ్డి

సహజసిద్ధంగా జీవించాలి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మానవుడు సహజ సిద్ధంగా జీవించాలని నేచురోపతి ఐదవ దినోత్సవం సందర్భంగా డాక్టర్ మురళీధర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ప్రభాత్ ఫార్మసీ కళాశాలలో ఎన్ఐఎన్ పూనే ఎన్ఐఓ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు నేచురోపతి గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుడు సహజ సిద్ధంగా ప్రకృతిపై ఆధారపడి జీవితాన్ని గడిపితే ఎలాంటి వ్యాధులు రాకుండా జీవిస్తాడని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల విద్యార్థులు, అధ్యాపక బృందం ,తదితరులు పాల్గొన్నారు.


ప్రార్థనలో పాల్గొన్న ఎంఇఒ సుభాన్

విద్యార్థులకు జాతీయ గీతం అలపించే విధంగా శిక్షణ ఇవ్వాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - పగిడ్యాల

విద్యార్థులకు జాతీయ గీతం, వందేమాతరం, మా తెలుగు తల్లికి గేయలని అలపించే విధంగా శిక్షణ ఇవ్వాలని ఎంఇఒ సుభాన్ ఉపాధ్యాయు లకు సూచించారు. మంగళవారం మండలంలోని బీరవోలు గ్రామంలోని ఎంపిపి పాఠశాలను తనిఖీ చేసి, ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడారు. ప్రార్థన గేయాలు ఎందుకు సక్రమంగా అలపించడం లేదని ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పగిడ్యాల మెయిన్ పాఠశాలను తనిఖీ చేసి, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ఉచితంగా మజ్జిగ అందిస్తున్నందుకు ఉపాధ్యాయులను అభినందించారు.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకుందాం

- ప్రజా సంఘాల నాయకులు విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - ఆత్మకూరు


ఆత్మకూరు : ప్రచారం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత వేసి గెలిపించాలని డివైఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు రణధీర్, సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నరసింహ నాయక్, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, రైతు సంఘం మండల అధ్యక్షులు మా బాష, ఉపాధ్యాయ, పట్టభద్రులను కోరారు. పట్టణంలో ఇంటింటికి, ఎంఆర్‌సి, ఆదిత్య స్కూల్‌లో, ఆత్మకూరు మండలంలోని పలు గ్రామాలలో పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. **కొత్తపల్లి :** సమస్యలు పరిష్కారం కావాలంటే పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపు అవసరమని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు బొల్లు ప్రసాద్ యాదవ్, వ్యకాసం మండల నాయకులు చిన్న చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని ముసలమడుగు, శివపురం, లింగాపురం గ్రామాలలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. **నందికొట్కూరు:** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోతుల నాగరాజును గెలిపించాలని ఏపీ రైతు సంఘం సిఐటియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేస్తూ ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి వెంకటేశ్వర్లు, సిఐటియు సీనియర్ నాయకులు ఎస్ ఉస్మాన్, సిఐటియు టౌన్ కార్యదర్శి నల్లబోతుల గోపాలకృష్ణ మాట్లాడారు. రైతు సంఘం నాయకులు ఎన్ కృష్ణయ్య, శ్రీనివాసులు, మౌలాలి, సిఐటియు భవన నిర్మాణ కార్మికులు ఎస్. మహబూబ్ బాషా, రామకృష్ణ, మధు బాబు, తిరుమలేష్ పాల్గొన్నారు. **బేతంచర్ల:** ప్రశ్నించే గొంతుకలైన ఉద్యమకారులను ఎమ్మెల్సీలుగా గెలిపించుకుందామని సిఐటియు జిల్లా నాయకులు వై ఎల్లయ్య, వైబి వెంకటేశ్వర్లు, వ్యకాసం జిల్లా నాయకులు ఆరు ఈశ్వరయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ అన్నారు. మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి ఎస్ రహమతుల్లా, బి రామాంజనేయులు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులుగా కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజులను గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి మల్లికార్జున, ఎర్రి గల సూరి తిమ్మయ్య, ఆంజనే యులు, నాగరాజు, ఏఐవైఎఫ్ మండల నాయకులు భాస్కర్, రామాంజనే యులు, తిమ్మయ్య, నరసింహ, నాగరాజు, చిన్న వ్యాపారస్తుల సంఘం నాయకులు రాజబాబు, వెంకటరమణ, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** ప్రజా వాణిని వినిపించే వారిని ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని సిఐటియు డివిజన్ కార్యదర్శి జివి.సుబ్బయ్య, అఖిలభారత యాదవ మహాసభ బనగానపల్లె నియోజకవర్గ కన్వీనర్ యాదవ్‌లు కోరారు. మంగళవారం పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. యాదవ సంఘం నాయకులు జానకిరామ్ యాదవ్, ప్రజా సంఘాల నాయకులు బాల మద్దిలేటి ,విజయ్ తదితరులు పాల్గొన్నారు. **మహానంది :** ఎపి గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి మోటారాముడు, ఎఐటియుసి నాయకులు సామెల్, వీరప్ప ఆధ్వర్యంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. **నంద్యాల అర్బన్ :** పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజులను గెలిపించుకుందామని ఎఐటియుసి నాయకులు ప్రసాద్, ఎఐఎస్ఎఫ్ నాయకులు సురేష్ తెలిపారు. నంద్యాల పట్టణంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. **పాణ్యం :** మండలంలో సిఐటియు, బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పోతుల నాగరాజుకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు భాస్కర్, పెరుగు శివకృష్ణ, రాజేష్, మనోహర్, శ్రీనివాసులు, అనిల్ కుమార్, మహేష్ పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** హక్కుల కోసం ప్రశ్నించే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజులను గెలిపించాలని ఎఐటియుసి నాయకులు ఆళ్లగడ్డ, దొర్నిపాడు మండలాల్లో ప్రచారం నిర్వహించారు. నాయకులు భాస్కర్, నాగరాముడు, ధనుంజయుడు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


బేతంచెర్ల : కరపత్రాలను అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు


ఎమ్మెల్యేకి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

దోబీ ఘాట్లను ఆక్రమణల నుంచి కాపాడండి : ఆర్‌విఎస్

ప్రజాశక్తి - ఆత్మకూరు

పట్టణ పరిధిలోని సంగమేశ్వరం రూట్లో గల ధోబి గాట్లను ఆక్రమిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి కాపాడాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి ఎపి రజక వృత్తిదారుల సంఘం నాయకులు మంగళవారం నాడు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా రజక వృత్తిదారుల సంఘం నంద్యాల జిల్లా కన్వీనర్ చందా వారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణంలో పుట్టగొడుగుల్లా పెరుగుతున్న అక్రమ లేఅవుట్లు వేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా ఆక్రమించే ధోబి ఘాటు స్థలాన్ని దోబీగాట్‌లకు తిరిగి కేటాయించి రజకుల కుటుంబాలను ఆదుకోవాలని వారు కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి రజకుల స్థలాన్ని రజకులకే ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం పట్టణ అధ్యక్షులు శీలం రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి చందా వారి శివకేశవ, నాయకులు పెద్ద వెంకటసుబ్బయ్య, బావాపురం శ్రీరాములు, శివుడు, జూపల్లె బాదర్ల, సాంబశివుడు, గొందిపల్లె శ్రీనివాసులు, పెద్ద పుల్లయ్య, రజకులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న

ఘనంగా మహిళా దినోత్సవం

ప్రజాశక్తి - సిరివెళ్ల

శిరివెళ్లలోని వెలుగు కార్యాలయంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు, ఏపీఎం పుణ్యవతి ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ నాయకదిల్షాద్ ముజఫర్ హుస్సేన్, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, తహశీల్దార్ షేక్ మొహిద్దీన్ హాజరై మాట్లాడారు. అనంతరం వివిధ క్రీడా విభాగాల్లో మొదటి, రెండవ బహుమతి పొందిన మహిళలకు మెమొంటోలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వెలుగు ఆఫీస్ సిబ్బంది, సిసిలు, వివోఏలు, మండల అకౌంటెంట్ ప్రసాదు, బాలకృష్ణ, గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. **పాణ్యం :** శాంతి రాం ఫార్మసీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి మధుసూదన్ శెట్టి మాట్లాడుతూ మహిళల హక్కులు, సమాన స్థాయి, సమాన హోదా తదితర అంశాలపై వివరించారు. కళాశాల అధ్యాపకులు రుక్సర్, జ్యోతి, స్వప్న, రేణుక, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని సమాజంలో మహిళలు గౌరవింపబడాలని ఎంపీడీవో మేరీ తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో ఉన్న మండల మహిళా కార్యాలయంలో ఏపిఎం పుల్లయ్య అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళా దినోత్సవంను పురస్కరిం చుకొని ఆటల పోటీలు నిర్వహించారు. ఆటల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించాలి అన్నారు. సమాజంలో మహిళలకు సమూచిత స్థానం కల్పించడంతోపాటు గౌరవించబడాలి అన్నారు. పలువురి మహిళా అధికారులనుని సన్మాంచారు. ఈ కార్యక్రమంలో సీసీలు వెలుగు కార్యాలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

ఆశాలకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ


వినతి పత్రం ఇస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, తదితరులు

ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, సిఐటియు మండల కార్యదర్శి రమేష్ బాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు జయలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరిగినది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు ప్రభుత్వానికి, ప్రజలకు నిత్యం సేవలందిస్తూ అతి తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని ప్రభుత్వానికి వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం చెల్లించే పదివేల రూపాయలలో నెలకు రూ.3000 విధి నిర్వహణలో ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. ఆశా కార్యకర్తలు అనారోగ్యాలకు గురి అవుతున్న సెలవులు లేవని, ఆశా కార్యకర్తలకు పని భారం ఎక్కువైందన్నారు. ఆశాలకు ఇచ్చే గౌరవ వేతనం ప్రతినెల 1వ తేదీన ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. విధి నిర్వహణలో చనిపోయిన ఆశ కార్యకర్తల కుటుంబాలకే తిరిగి ఆశ ఉద్యోగం ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే ఆశ కార్యకర్తలను రిటైర్మెంట్ చేస్తున్నారని, దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఎలాంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆశా కార్యకర్తలకు అందడం లేదని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని వారు కోరారు. ఆళ్లగడ్డ అర్బన్ డాక్టర్ వర్షిణికి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జయలక్ష్మి, వరలక్ష్మి, కళావతి, చిన్నక్క, హుస్సేన్ బి, పద్మావతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి - నందికొట్కూరు


మృతి చెందిన మదన్ మోహన్


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు ఎం.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన పట్టణంలోని వడ్డేపేట కాలనీలో చోటు చేసుకుంది. సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో పగిడ్యాల రోడ్డు వడ్డేపేట కాలనీలో 9వ తరగతి చదువుతున్న మద్దిలేటి కుమారుడు మధుమోహన్ ఇంటికి నీరు పడుతుండగా విద్యుత్ స్తంభంపై విద్యుత్ తీగ ప్రసారానికి అర్త్ మూలంగా చెల్లెలు విద్యుత్ షాక్‌కు గురవుతుండగా ఆమెను కాపాడబోయి మధుమోహన్ మృతి చెందడం జరిగింది.

మృతుడి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి : సిపిఎం

మంగళవారం నందికొట్కూరు ప్రభుత్వ హాస్పిటల్‌లో పోస్టుమార్టం చేస్తున్న మృతదేహాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు ఎం నాగేశ్వరావు, నాయకులు పి వెంకటేశ్వర్లు, పి పకీర్ సాహెబ్, గోపాలకృష్ణ, వేణుగోపాల్ సిపిఎం బృందం సందర్శించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం రూ.20 లక్షలు ఎక్స్ గ్రేసియా ఇవ్వాలని, సంబంధించి విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. నందికొట్కూరు పట్టణం, గ్రామాల్లో వ్యవసాయ పొలాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయిన విద్యుత్ తీగలు వేలాడుతున్న విద్యుత్ అధికారులు పట్టించుకోవడంలేదని వారు ఆరోపించారు. వడ్డేపేట, నాగలకట్ట, దగ్గర విద్యుత్ స్తంభం పడిపోయే దశలో ఉన్న పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకుడు అబ్దుల్లా, వడ్డెర సంఘం నాయకులు చక్రిధర్, రాము, వెంకట్, వెంకటేష్, శ్రీను, వాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై ఎంపిటిసిలకు అవగాహన

ప్రజాశక్తి - మిడుతూరు

మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీటీసీలకు, నెంబర్లకు స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ సరళిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జీఎన్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికలు సక్రమంగా నిర్వహించాలని సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి ఒక ఎంపిటిసి ఎమ్మెల్సీ ఓటును సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. **చాగలమర్రి :** పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మండలం లోని ఎంపీటీసీ సభ్యులకు ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దారు విజయకుమార్, ఎంపీడీవోలు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈనెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంపీటీసీలు వారి ఓటుహక్కును వినియోగించుకో వడం ఎలా, ఏ విధంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్న అంశాలను తెలియజేశారు. ఈవో సుదర్శన్ రావు పాల్గొన్నారు. **రుద్రవరం :** స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగంపై ప్రజాప్రతినిధులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మధుసూదనరెడ్డి మాట్లాడుతూ ఈనెల 13న నంద్యాలలోని ఆర్డీవో కార్యాలయంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల సంబంధించి ఎన్నికలు జరుగుతాయని, ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. రుద్రవరం మండలానికి సంబంధించి 14 మంది ఎంపిటిసిలు, 1 జడ్పిటిసి ఓటు హక్కు వినియోగించుకుంటారన్నారు. వీరికి ఓటు హక్కు వినియోగించుకునే సమయంలో ప్రాధాన్యత క్రమంలో ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలని అంశాలపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఏవో వరలక్ష్మి, ఎంపీపీ బాలస్వామి, ఆయా గ్రామాల ఎంపిటిసిలు పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించాలి

ప్రజాశక్తి-డోన్


వృద్ధులకు భోజనాలను అందిస్తున్న జాన ప్రభాకర్ దంపతులు

వృద్ధాశ్రమంలో ఉండే వృద్ధులను ఆదరించాలని హోసన్న వృద్ధాశ్రమ నిర్వాహకులు జాన ప్రభాకర్ అన్నారు. మంగళవారం డోన్ పట్టణంలోని తెలంగాణ రాష్ట్రంలోని జడ్చర్ల పట్టణానికి చెందిన గడ్డంహేమీమా, జాన హెప్సిబా ఇద్దరు కలిసి రూ.10,000 విలువ చేసే మంచము,వంట సామా గ్రి, భోజనాలు వృద్ధాశ్రమంలో ఉండే వృద్ధులకు అందించారని తెలిపారు. ఈ సందర్భంగా జాన ప్రభాకర్ మాట్లాడుతూ తల్లిదండ్రులను జ్ఞాపకం చేసుకొని వారి వర్ధంతి సందర్భంగా వృద్ధాశ్రమానికి చేయూత అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జానా హెప్సిబా, వృద్ధాశ్రమం సూపర్వైజర్ కె.భారతి, వృద్ధులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మాక్ పోలింగ్

ప్రజాశక్తి-డోన్


కౌన్సిలర్లకు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలపై డోన్ మున్సి పల్ కార్యాల యంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికల మాక్ పోలింగ్ నిర్వ హించారు. ఓటు ఎలా వెయ్యాలి. ఇన్‌వాల్యుడ్ కాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనేది తగు సూచనలు చేశారు. ప్రతి కౌన్సిలర్‌కు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈనెల 13న ప్రతి సభ్యుడు పూర్తి అవగాహనతో ఓటింగులో పాల్గొనేలా సూచనలు , సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు హరికిషన్, జాకీర్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి : పిడిఎస్‌యు

ప్రజాశక్తి - నంద్యాల

జిల్లా వ్యాప్తంగా ఇంటర్ కళాశాలల్లో ఫీజులు, హాజరు పేరుతో విద్యార్థులకు 15 నుంచి ప్రారంభమయ్యే పరీక్షలకు సంబంధించి హాల్ టికెట్లు ఇవకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు ఎస్ఎండి.రఫి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఏపిటిఎఫ్ కార్యాలయంలో పిడిఎస్‌యు నంద్యాల పట్టణ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ కరువు కాటకాలతో కొట్టుమిట్టాడుతున్న కర్నూలు జిల్లాలో విద్యార్థులను ఫీజుల పేరుతో వేధించకుండా హాల్ టిక్కెట్లు వెంటనే ఇవ్వాలన్నారు. విద్యార్థులకు హాల్ టిక్కెట్లు ఇవ్వని పక్షంలో ఆ విద్యాసంస్థల ముందు పిడిఎస్‌యుగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు, అధిక ఎండను దృష్టిలో ఉంచుకుని తాగునీరు, ప్రథమ చికిత్స సౌకర్యం, ఫ్యాన్లు, లైట్లు, బెంచీలు, ఏర్పాటు చేయాలని, ఆర్టీసీ అధికారులు స్పందించి పరీక్షా కేంద్రాలకు ప్రత్యేక బస్సులు తగిన సమయానికి నడపాలని కోరారు. విద్యార్థులకు సమస్యలు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు గిరి, నవీన్, వినోద్, సుభాష్, సురేష్, వినయ్, కుపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బేతంచెర్ల

క్రిమి సంహారక మందు తాగి చికిత్స పొందుతూ కోలుకోలేక వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని గూటిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బోయ రామకృష్ణ (34) మద్యానికి బానిసై గత నెల 20వ తేదీ పశువులు మేసే గడ్డికి పిచికారి చేసే మందు (క్రిమి సంహారక మందు) సేవించాడు. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోల్కోలేక మంగళవారం మృతి చెందాడు. భార్య రంగమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహారాజశ్రీ ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No.35/2022

మంటి రామచంద్రుడు. ...వాది
V/S
లుక్కాని ఓబులేసు మరియు ఇతరులు. ...ప్రతివాదులు

To
యల్లిబోయిన వెంకట శివుడు,
S/o.నారాయణ,
R/o.పెద్ద బదనం గ్రామం,
చాగలమరి మండలం,
కర్నూలు జిల్లా ప్రస్తుతం నంద్యాల జిల్లా.

దావా సమన్లు

పై నెంబరు కేసులో ప్రతివాది (D4) అయిన నీవు సమన్లు తీసుకోకుండా ఉన్నందున నీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా 13-03-2023వ తేదీన వేసియున్నారు. నీవు ఆ తేదీన స్వయంగా గాని న్యాయవాది ద్వారా గాని కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలున్న యెడల తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్ష మందు తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా : 13-03-2023

ఇట్లు
బి.శివ ప్రసాదరావు,
న్యాయవాది నోటరి,
సత్రం వీధి,
ఆళ్లగడ్డ.

మహారాజశ్రీ ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No.162/2021

1) కోటపాటి లావణ్య
2) కోటపాటి వైష్ణవి
3) కోటపాటి లింగ ప్రశాంత్
All are minors represented by guardian mother
కోటపాటి శివకుమారి. ...వాదులు
V/S
కోటపాటి నడిపి నాగన్న మరియు ఇతరులు. ...ప్రతివాదులు

To
కోటపాటి నడిపి నాగన్న
S/o.పెద్ద నాగన్న, రామాలయం వీధి,
ఎర్రగుంట్ల గ్రామం, సిరివెళ్ల మండలం.
కర్నూలు జిల్లా ప్రస్తుతం నంద్యాల జిల్లా.

దావా సమను

పై నెంబరు కేసులో ప్రతివాది (D1) అయిన నీవు నోటీసులు తీసుకోకుండా ఉన్నందున నీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా 29-03-2023వ తేదీన వేసియున్నారు. నీవు ఆ తేదీన స్వయంగా గాని న్యాయవాది ద్వారా గాని కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలున్న యెడల తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్ష మందు తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా : 13-03-2023

ఇట్లు
బి.శివ ప్రసాదరావు,
న్యాయవాది నోటరి,
సత్రం వీధి,
ఆళ్లగడ్డ.

మహారాజశ్రీ గౌరవ సీనియర్ సివిల్ జడ్జి, ఆళ్లగడ్డ కోర్టు వారి నందు
H.M.O.P: 71 /2022

కుంటుమల్ల రవళి @ పల్లా రవళి .... Petitioner
V/s
పల్లా సాయి కుమార్ .... Respondent

రెస్పాండెంట్ కు నోటీసు

To,
పల్లా సాయి కుమార్ S/o దస్తగిరి
H.No : 4-166/B, యర్రగుంట్ల, సిరివెళ్ల మండలం, నంద్యాల జిల్లా.
ప్రస్తుత నివాసము H.No. : 76-117/12, కృష్ణా రెడ్డి నగర్, కర్నూలు టౌన్ & జిల్లా.

పై నంబరు పిటిషన్ లో పిటీషినర్ తనకు మీ నుంచి విడాకులు మంజూరు చేయమని కోరుచూ పిటిషన్ దాఖలు చేసినందున, ప్రతివాది అయిన నీకు కోర్టు నుంచి పలుమార్లు నోటీసులు పంపిననూ తీసుకోనందున, పై నంబరు పిటిషన్ లో ప్రకటన ద్వారా న మీ యొక్క హాజరు నిమిత్తము 10-04-2023 తేదీన కోర్టు వారు వాయిదా వేయడం జరిగినది.

కావున పైన తెలిపిన తేదీన మీరు ప్రత్యక్షంగా కానీ, నీ తరుపున వకీలు కానీ హాజరు అయ్యి , నీ ఆక్షేపనలు కోర్టు నందు తెలుపుకొనవలెను, లేనిచో మీ పరోక్షమున కోర్టు వారు దావా తీర్మానిచెదరని ఇందుమూలముగా తెలియజేయదమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేదీ : 10-04-2023

ఇట్లు
డి. ప్రభాకర రెడ్డి
పిటీషినర్ తరపు అడ్వొకేటు, ఆళ్లగడ్డ.

మహారాజశ్రీ గౌరవ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఆళ్లగడ్డ నందు
OS: 245 / 2022

చిన్నెడ్డి కృష్ణ వేణి .... Plaintiff.
V/s
శ్రీబావికాడి ఊసేని ఏ బావికాడి హూసైన్
S/o హుస్సేని, H.No: 1-6-5, B.C. కాలనీ,
గోస్పాడు గ్రామం & మండలం, నంద్యాల జిల్లా.
..... Defendant

నోటీసు

పై నంబరు దావా లో వాది తనకు రావలసిన ప్రామిసరి నోటు మొత్తమును రాబోట్టుకొనుటకు, ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా నోటీసులు పంపిననూ నీవు నోటీసులు తీసుకోనందున, ఈ ప్రకటన ద్వారా మీ యొక్క హాజరు నిమిత్తము 27-04-2023 తేదీన కోర్టు వారు వాయిదా వేయడం జరిగినది.

కావున పైన తెలిపిన తేదీన మీరు ప్రత్యక్షంగా కానీ, నీ తరుపున వకీలు కానీ హాజరు అయ్యి , నీ ఆక్షేపనలు కోర్టు నందు తెలుపుకొనవలెను, లేనిచో మీ పరోక్షమున కోర్టు వారు పిటిషన్ తీర్మానిచెదరని ఇందుమూలముగా తెలియజేయదమైనది.

వాయిదా తేదీ : 27-04-2023
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఇట్లు
ప్రభాకర రెడ్డి. దాట్ల
వాది తరపు అడ్వొకేటు, ఆళ్లగడ్డ
Cell : 9399993323

మహారాజశ్రీ గౌరవ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఆళ్లగడ్డ నందు
IA 1091/2022 in OS: 245 / 2022

చిన్నెడ్డి కృష్ణ వేణి
.... Petitioner/ Plaintiff
V/s
బావికాడి ఊసేని ఏ బావికాడి హూసైన్
S/o హుస్సేని, H.No: 1-6-5, B.C కాలనీ, గోస్పాడు గ్రామం & మండలం, నంద్యాల జిల్లా.
.... Respondent/ Defendant

నోటీసు

పై నంబరు పిటిషన్ లో పిటిషనర్ ప్రతివాది కి చెందిన క్రింది సెద్యూలు దాఖలా స్థిరాస్తిని జడ్జిమెంట్ మునుపే జప్తుకొరకు పిటిషన్ దాఖలు చేసిఉన్నారు, కోర్టు నుంచి పలుమార్లు నోటీసులు పంపిననూ మీరు నోటీసులు తీసుకోనందున , ఈ ప్రకటన ద్వారా నీయొక్క హాజరు నిమిత్తము 27-04-2023 తేదీన కోర్టు వారు వాయిదా వేయడం జరిగినది.

కావున పైన తెలిపిన తేదీన మీరు ప్రత్యక్షంగా కానీ, నీ తరుపున వకీలు కానీ హాజరు అయ్యి, నీ ఆక్షేపనలు కోర్టు నందు తెలుపుకొనవలెను, లేనిచో మీ పరోక్షమున కోర్టు వారు పిటిషన్ తీర్మానిచెదరని ఇందుమూలముగా తెలియజేయదమైనది.

స్థిరాస్థి సెద్యూలు

నంద్యాల జిల్లా, సిరివెళ్ల సబ్ రిజిస్ట్రేషన్ పరిధి, గోస్పాడు మండలం మరియు గ్రామములోని ఇంటితో కూడిన స్థలము తాలూకు
Survey No: 377 H.No. :1-14, విస్తీర్ణము : 0.02 ½

హద్దులు
తూర్పు : దూదేకుల బాబు ఇల్లు, పడమర: రాస్తా
ఉత్తరం : రాస్తా, దక్షిణం: రాస్తా
సుమారు విలువ : 1,00,000/-

వాయిదా తేదీ : 27-04-2023
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఇట్లు
ప్రభాకర రెడ్డి. దాట్ల
పిటిషనర్ అడ్వొకేటు, ఆళ్లగడ్డ
Cell : 9399993323